ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు




నూతన పైప్‌లైనుకు ప్రతిపాదనలు



అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..


పిఠాపురం 18వ వార్డులో డ్రెయిన్లలో దోమల నివారణకు స్ప్రే

- నీటి సరఫరా మెరుగుకు చర్యలు
- నేలపై ఉన్న కుళాయిల మార్పు
- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చా వేదికలోని సమస్యల పరిష్కారంపై ప్రజల హర్షం

పిఠాపురం, జనవరి30 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చా వేదికలో ప్రజలు చెప్పిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు అధికారులు చేపట్టిన చర్యలు ఫలితాలను ఇస్తున్నాయి. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో చెత్తాచెదారాన్ని, డ్రెయిన్లల్లో పూడికలు తొలగించిన మునిసిపల్ సిబ్బంది బుధవారం ఇంటింటా చెత్తసేకరణ ప్రారంభించారు. ఇప్పుడు అతి తక్కువ సమయం మాత్రమే తాగునీరు వస్తున్న పబ్లిక్ కుళాయిలపై దృష్టి సారించారు. ఇక్కడ నీటి సరఫరా మెరుగుదలకు పైపులైన్లు ఏర్పాటుచేయాలా లేకుంటే ప్రత్యేకంగా వాల్వ్‌లు ఏర్పాటుచేసి నీటి సరఫరా చేయాలా అనే అంశంపై పరిశీలన జరిపారు. 'అక్షరం అండగా...పరిష్కారమే అజెండాగా' పేరుతో పిఠాపురం పట్టణంలోని 18వ వార్డు కుంతీమాధవస్వామి ఆలయం వద్ద ఇటీవల నిర్వహించిన చర్చా వేదికలో ప్రజలు పలు అంశాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. వీటి పరిష్కారంపై వేదికపై నుంచే మునిసిపల్ కమిషనరు నామా కనకారావు ఆదేశాలిచ్చారు. నాయకులు పలు సూచనలు చేశారు. వీటికి అనుగుణంగా బుధవారం 18వ వార్డులోని గుట్ల వీధి, తిమ్మరాజు వీధి ప్రాంతాల్లో నీటి సరఫరా విభాగం అధికారులు పర్యటించారు. తక్కువ నీరు వస్తున్న పబ్లిక్ కుళాయిలను ఉదయం, సాయంత్రం పరిశీలించారు. నీరు ఎక్కడి నుంచి తక్కువ వస్తుందో గుర్తించి దానిని ఏవిధంగా మెరుగుపరచాలో పరిశీలించారు. ఎక్కువ ఎత్తు ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడకు నీటిని అందించేటప్పుడు మిగిలిన ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపివేస్తే అందుతుందో లేదో పరిశీలన జరపాలని నిర్ణయించారు. అదేవిధంగా తిమ్మరాజు వీధి తదితర ప్రాంతాల్లో నేలపై ఉన్న కుళాయిలను పరిశీలించారు. వీటిని మార్పు చేయాలని ప్రతిపాదించారు. ఈ పరిశీలనలో మునిసిపల్ ట్యాప్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. కాకినాడ రోడ్డులో నూతనంగా పైపులైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. సుమారు 100 కుటుంబాలకు తాగునీరు అందడం లేదని వార్డు కౌన్సిలర్ పంపనబోయిన అన్నపూర్ణ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వీటికి అంచనాలు తయారుచేసి ఎమ్మెల్సీ కోడ్ ముగియగానే పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు.


గుట్ల వీధిలో పైప్‌లైన్ ఏర్పాటుకు కుళాయిలను పరిశీలిస్తున్న మునిసిపల్ సిబ్బంది

కొనసాగిన పారిశుధ్య చర్యలు

18వ వార్డు పరిధిలోని కుంతీమాధవస్వామి ఆలయం వీధి, నూకాలమ్మ తల్లి, లక్ష్మీదేవి ఆలయాలు, తిమ్మరాజు వీధి, బొబ్బట్ల సుబ్బారావు దుకాణం వీధి(ఆవంత్స సోమసుందర్ వీధి), వెంలపేట, కోటవారి వీధి, పాత యాదవ వీధి, గుట్ల వీధి, కాకినాడ రోడ్డు, బారువారి వీధి, ప్రభుత్వాసుపత్రి సెంటర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య ప్రత్యేక చర్యలు కొనసాగాయి. డ్రెయిన్లల్లో పూడికను, నిలిచిపోయిన నీటిని తొలగించి దోమల నియంత్రణకు పారిశుధ్య సిబ్బంది మందును పిచికారీ చేశారు. ఇంటింటా చెత్త సేకరణ చేశారు. అలాగే కుంతీమాధవస్వామి దేవస్థానం పరిసర ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగడం లేదనే ఫిర్యాదులపై అధికారులు దృష్టిసారించారు. గురువారం నుంచి వీధిలైట్లకు మరమ్మతులు నిర్వహించనున్నారు. చర్చావేదికలో ఫిర్యాదుచేసిన వెంటనే సమస్యలు పరిష్కారం కావడంపై వార్డు ప్రజలు హర్షం వ్యక్తంచేసి ఏబీఎన్ ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యావికాసం దిశగా..

- పాఠశాలల్లో ఏపీశాట్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలు
- మౌలిక వసతుల కల్పనకు ఇప్పటివరకూ జరిగిన నిధులు వినియోగమే లక్ష్యం
- ఇంకా మిగిలిన పనులకు నిధులు ఎంతమేర కావాల్సి ఉందో ప్రతిపాదనలు

కాకినాడ రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యలో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించడంతోపాటు విద్యావికాసం దిశగా పాఠశాలలను నడిపించేందుకు విద్యాశాఖ కార్యాచరణ చేపట్టింది. దీనికిగానూ మౌలిక వసతుల కల్పనకు పాఠశాలల్లో ఇప్పటివరకూ జరిగిన నిధుల వినియోగం, చేపట్టిన పనులు ఏవిధంగా ప్రయోజనకరంగా ఉన్నాయి, ఇంకా మిగిలిన పనులకు ఎంతమేరకు నిధులు కావాల్సి ఉందో ఏపీ సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ అకౌంటబిలిటీ ట్రాన్స్‌పెరెన్సీ (ఏపీశాట్) ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలు నిర్వహిస్తోంది. అంతేకాకుండా విద్యలో ప్రగతి సాధించేందుకు అమలుచేయాల్సిన కార్యక్రమాలకు సంబంధించి పాఠశాల యాజమాన్య కమిటీలు, విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి సూచనలు తీసుకుంటోంది.

సమగ్రంగా శ్రేణుల వారీగా..

కాకినాడ జిల్లాలోని 35 పాఠశాలల్లో 18,880 మంది విద్యార్థుల ప్రగతిని సామాజిక తనిఖీ ద్వారా నిర్వహిస్తుండగా, వాటిలో ఇప్పటికే 10 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని సామాజిక తనిఖీ పూర్తికాగా మిగిలిన 25 పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతిని సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. విద్యార్థుల హాజరు, సమకూరుతున్న వసతులు, స్టూడెంట్ కిట్లు, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల భద్రత, విద్యార్థుల రక్షణతోపాటు శ్రేణుల వారీగా వారి ప్రగతిని పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా క్రీడాస్థలాలు, ఇతర మౌలిక సౌకర్యాలు ఏవిధంగా ఉన్నాయో తనిఖీ చేస్తున్నారు. ఉపాధ్యాయుల వివరాలు, భర్తీచేయాల్సిన ఖాళీలు, అవసరమయ్యే తరగతి గదులు, కావాల్సి బోధనోపకరణాల వివరాలను నమోదుచేసి రికార్డులను పరిశీలించి వాటి ఆధారంగా తదుపరి చేపట్టాల్సిన కార్యాచరణపై అన్ని వివరాలతో కూడిన సమగ్ర నివేదికను రూపొందిస్తున్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మరింత గుణాత్మకంగా తీర్చిదిద్దడంతోపాటు అన్ని అంశాలపై అవగాహన పెంచేందుకు జిల్లాలోని 1280 పాఠశాలల ఎస్ఎంసీ ఛైర్మన్లు, సభ్యులతో సహా ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చారు. దీనిని యాజమాన్య కమిటీలకు, ఉపాధ్యాయులకు రెండు దశల్లో నిర్వహించారు.

విద్యాభివృద్ధే లక్ష్యం



పాఠశాలల్లో ఇప్పటికే పూర్తయిన వివిధ పనులను పర్యవేక్షించడంతో మరి కొన్ని మౌలి క వసతుల కల్పన దిశగా జిల్లాలో ఎంపికచేసిన పాఠశాలల్లో సామాజిక తనిఖీలు కొనసాగుతున్నాయి. అన్ని విభాగాలకు సంబంధించిన అంశాలను వారు పరిశీలిస్తున్నారు. ఎస్ ఎంసీ ఛైర్మన్లు, సభ్యులు, ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు పాఠశాలల అభివృద్ధి, సమకాలీన సమస్యలు వాటి పరిష్కారాలపై అవగాహన పెంచేందుకు శిక్షణా కార్యక్రమాలను ఇప్పటికే పూర్తిచేశాం.

\- సీహెచ్ నాగేశ్వరరావు, సీఎంవో, సమగ్ర శిక్ష

బుర్రకథ.. ఊపిరిగా..



మిరియాల అప్పారావు.. మొన్నటి వరకూ ఒక బుర్రకథ కళాకారుడు మాత్రమే.. ఆయన కళ కోసం ఎంత పరితపించారనేది సమాజానికి తెలియని వాస్తవం..ఆ వాస్తవంలోకి వెళ్లి చూస్తే ఆకలి.. కష్టాలు.. కన్నీళ్లు.. బాధలు.. బాధ్యతలు.. అయినా ఆయన మాత్రం కళను వదల్లేదు.. చివరి వరకూ కళనే ఊపిరిగా చేసుకుని జీవించారు.. ఎంతో మంది ఆ కళతో ఏం సాధించా వన్నా చిరునవ్వే సమాధానం.. బుర్రకథకు ఆదరణ తగ్గినా తుది వరకూ అదే ఊపిరిగా బతికారు.. ఈనెల 15వ తేదీన కళామతల్లి ఒడిలోనే ఒరిగిపోయారు..ఆయన లేకున్నా.. కష్టం ఎక్కడికి పోతోంది.. అందుకే కేంద్రం అందించే ఎంతో అత్యున్నత పురస్కారం పద్మశ్రీ దశదినకర్మ రోజునే వెతుక్కుంటూ వచ్చింది.. మళ్లీ మిరియాల బుర్రకథకు ఊపిరులూదింది..! - వివరాలు 6లో



'పన్ను' లోటు!

- ఉమ్మడి తూ.గో. జిల్లాలో పేరుకుపోయిన ఆస్తిపన్ను బకాయిలు
- కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో రూ.173 కోట్ల పెండింగ్
- ఏళ్ల తరబడి వసూళ్లకు నానా తిప్పలు పడుతున్న అధికారులు.. టార్గెట్లతో కుస్తీ
- అత్యధిక బకాయిలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు దుకాణాలు, ఖాళీస్థలాలవే
- అత్యధికంగా కాకినాడ, రాజమహేంద్రి కార్పొరేషన్లలో సగానికిపైనే బకాయిలు
- అమలాపురం మున్సిపాల్టీలో రూ.14.65కోట్లకుగాను రూ.8.95 కోట్ల బాకీలు
- రూ.173కోట్ల బాకీలో రూ.80 కోట్ల వరకు వసూలు అసాధ్యమన్న అధికారులు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆస్తి పన్ను బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ఏళ్లకు ఏళ్ల వసూలవక చుక్కలు చూపిస్తున్నాయి. కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు ఎన్ని ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నా మొండిబాకీలు కదలనంటున్నాయి. ఒకపక్క ఇంటి పన్నులు ఎంతో కొంత వసూలవుతున్నా ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు, వాణిజ్య దుకాణాలు, ఖాళీ స్థలాల పన్నులు మాత్రం ఎక్కడివక్కడే అన్నట్టు కదలడం లేదు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఆస్తి పన్ను బకాయిలు రూ.173కోట్ల వరకు పేరుకుపోయాయి. ఇందులో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు గత కొన్నేళ్ల బకాయిలు సైతం కలిపి ఈ స్థాయిలో పేరుకుపోయాయి. అత్యధికంగా కాకినాడ జిల్లాలో రూ.80.17 కోట్లు, తూ.గో.లో రూ.74.80కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రూ.18.76 కోట్లు బాకీలు ఉన్నాయి. ఈ మొత్తం బాకీల్లో అత్యధికంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కంపెనీలు, ఖాళీ స్థలాలే ఉన్నాయి. ఎంత ప్రయత్నిస్తున్నా మొండిబాకీలు కదలడం లేదు. ఇందులో కొన్ని సంస్థలు, కంపెనీలవైతే ఏకంగా పదేళ్లకుమించే బాకీలున్నాయి. దీంతో ఈ బకాయిలను ఏంచేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కదలితేగా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఏటా ప్రతి ఇంటి యజమాని నుంచి ప్రైవేటు వాణిజ్య దుకాణాలు, పరిశ్రమలు, కంపెనీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీస్థలం యజమానులు ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు ఆస్తిపన్ను చెల్లించాలి. లేదంటే మున్సిపల్ పరిపాలనశాఖ అపరాధ రుసుం సైతం వసూలు చేస్తుంది. మరోపక్క పన్ను వసూళ్లకు ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు ప్రత్యేక రెవెన్యూ విభాగం ద్వారా ఇంటింటికి, దుకాణాల వద్దకు వెళ్లి పన్నులు వసూలు చేస్తాయి. అటు ఆన్‌లైన్‌లోను చెల్లింపులు జరపొచ్చు. కానీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం ఆస్తి పన్నుల వసూలు పెద్దగా జరగడం లేదు. ప్రతి ఏటా బాకీలు భారీగా పెరిగిపోతున్నాయి. మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి పన్నుల వసూళ్లు చేస్తున్నా కేవలం గృహ సంబంధిత పన్నులే ఎక్కువగా వసూలవుతున్నాయి. ప్రైవేటు సంస్థలు, కంపెనీలు, పరిశ్రమల నుంచి అసలు బాకీలు కదలడం లేదు. అటు ఖాళీ స్థలాల యజమానులు సైతం బకాయిలు చెల్లించడం లేదు. ఇక ప్రభుత్వ కార్యాలయాలైతే బడ్జెట్ లేక ఏళ్ల తరబడి పన్నులు కట్టడం లేదు. దీంతో ఇవన్నీ కలిపి కోట్లలో పేరుకుపోతున్నాయి. వీటిని ఎలా వసూలు చేయాలో తెలియక మున్సిపల్ అధికారులు తలపట్టుకుంటున్నారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు పాత బకాయిలు కలిపి ఆస్తి పన్నుల బకాయిలు రూ.132.18కోట్లు వసూలు కావలసి ఉండగా, ఇంతవరకు రూ.52.01కోట్లు వసూలైంది. ఇంకా రూ.80.17కోట్లు రావలసి ఉంది. ఇందులో కాకినాడ కార్పొరేషన్‌కు పాత,కొత్త బకాయిలు కలిపి రూ.100.08 కోట్లు రావలసి ఉండగా, ఇంతవరకు రూ.37.30కోట్లే వసూలైంది. ఇంకా రూ.62.78 కోట్లుపైగా బకాయిలు వసూలు కావలసి ఉంది. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, కొన్ని కోర్టు వివాదాల కారణంగా రూ.100 కోట్లలో రూ.20 కోట్ల వరకు పన్నులు వసూలయ్యే అవకాశం లేదని కమిషనర్ భావన వివరించారు. మిగిలిన రూ.80 కోట్లలో రూ.50 కోట్ల వరకు వసూలైందని తెలిపారు. ప్రధానంగా ఖాళీ స్థలాల పన్ను రూ.28కోట్ల వరకు రావలసి ఉందన్నారు. కానీ బాకీలపరంగా కాకుండా ఈ ఆర్థిక సంవత్సరం పన్ను వసూళ్లలో కార్పొరేషన్ రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందన్నారు. మరోపక్క తుని మున్సిపాల్టీలో రూ.6.23 కోట్లకుగాను ఇంతవరకు రూ.3.81కోట్లు, పెద్దాపురం రూ.6.05 కోట్లకు రూ.3.22కోట్లు, సామర్లకోట రూ.7.33 కోట్లకు రూ.2.75కోట్లు, పిఠాపురం రూ.8.68 కోట్లకు రూ.2.67కోట్లు, ఏలేశ్వరం నగర పంచాయతీలో రూ.2.35 కోట్లకు రూ.96 లక్షలు, గొల్లప్రోలు రూ.1.47 కోట్లకు రూ.90 లక్షలే వసూలైంది.

తూర్పుగోదావరిలో..

రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు పాత బకాయిలు కలిపి రూ.119.46 కోట్ల ఆస్తిపన్ను వసూలవ్వాల్సి ఉంది. కానీ ఇందులో రూ.50.04 కోట్లే వసూలైంది. ఇంకా రూ.69.42 కోట్లు వసూలవ్వాల్సి ఉంది. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు, ప్రభుత్వ ప్రైవేటు స్థలాల నుంచి మాత్రం ఆస్తిపన్నులు వసూలవడం లేదు. అధికారులు ఎన్ని నోటీసులు ఇస్తున్నా వీటి నుంచి స్పందన లేదు. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల నుంచి పన్నులు, కొన్ని న్యాయస్థానం వివాదాలతో కలిపి రూ.23 కోట్ల వరకు పన్నులు వచ్చే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. అటు నిడదవోలు మున్సిపాల్టీలో రూ.7.29 కోట్లకుగాను రూ.3.11 కోట్లే ఆస్తిపన్ను వసూలైంది. కొవ్వూరులో రూ. 3.86 కోట్లకు రూ.2.66కోట్లే వసూలైంది. వెరసి తూర్పుగోదావరి జిల్లాలో రూ.130.61కోట్ల మొత్తం ఆస్తిపన్ను బకాయిలకు ఇప్పటివరకు రూ. 55.81 కోట్లే వసూలైంది. ఇంకా రూ.74.80 కోట్లు వసూలు కావలసి ఉంది. అయితే ఇందులో సగం వరకు వసూలయ్యే అవకాశం తక్కువని అధికారులు ఓ అంచనాకు వచ్చారు.

కోనసీమలో ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రధానంగా అమలాపురం మున్సిపాల్టీలో రూ.14.65 కోట్లకుగాను ఇంతవరకు రూ.5.70 కోట్లే వసూలైంది. మండపేటలో రూ.7.75 కోట్లకు రూ.4.44 కోట్లు, రామచంద్రపురం రూ.9.47 కోట్లకు రూ.3.52కోట్లు, ముమ్మిడివరం రూ.1.57 కోట్లకు రూ.కోటి వసూలైంది. ఈ జిల్లాలో మొత్తం రూ.33.42 కోట్ల పన్నుల వసూలుకుగాను రూ.14.66 కోట్లే జమైంది. ఇంకా రూ.18.76 కోట్ల వరకు రావలసి ఉంది. అయితే మొండి బకాయిలు రూ.9 కోట్ల వరకు ఉన్నాయని ఇవి వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఉమ్మడి జిల్లాలో ఆస్తిపన్నులకు సంబంధించి ఏటా ప్రతి ఆర్థిక సంవత్సరంలో కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు టార్గెట్ల నేపథ్యంలో చాలావరకు నివాస గృహాల నుంచే అధికారులు ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు కంపెనీలు, సంస్థలు, దుకాణాలు, ఖాళీ స్థలాల నుంచి మాత్రం రాబట్టడంలో విఫలమవుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో వెంకటరావు

సమన్వయంతో పరీక్షల సక్రమ నిర్వహణ : డీఆర్వో

కాకినాడ సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలన్నీ సక్రమంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు సూచించారు. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, విద్య, వైద్య, ఆరోగ్య, పోలీస్, విద్యుత్, ఆర్టీసీ, పోస్టల్, ఇతర శాఖల అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో వెంకటరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 5 నుంచి 19 వరకు ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 1 నుంచి 20 వరకు థియరీ పరీక్షలు జరగనున్నాయన్నారు. ఈ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లాలో ప్రాక్టికల్ పరీక్షలకు 89, పబ్లిక పరీక్షలకు 6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్ష సమయంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. ప్రశ్నాపత్రాల తరలింపులో తగిన ఎస్కార్టు, పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీస్ శాఖకు సూచించారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ ఆయా పరీక్షా కేంద్రాల రూట్లలో తగినన్ని బస్సులను కేటాయించాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో అవసరమైన ఇన్విజిలేటర్ల నిమిత్తం జిల్లా విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జీజీకే నూకరాజు, కాకినాడ జిల్లా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ప్రత్యేక అధికారి కె అప్పలరాజు, జిల్లా పోలీస్, విద్యా, పంచాయతీ, విద్యుత్, ఆర్టీసీ, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూముల విలువలకు రెక్కలు 7

వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి హత్య 7

ఎన్నో జీవితాలను కథలుగా మార్చారు.. తందాన తాన తందనాన అంటూ బుర్రకథ రూపంలో ప్రజల చెంతకు తీసుకెళ్లారు.. ఆయన జీవితమూ ఒక కథే.. తరచి చూస్తే ఒక కన్నీటి జీవన ప్రయాణమే.. కళనే నమ్ముకుని ఏం సాధించారంటే పేరు తప్ప ఏం లేదు.. చివరి వరకూ కళనే నమ్ముకున్నారు.. ఆకలితో ఉన్నా ఆ కళను మాత్రం ఆపలేదు.. చివరి వరకూ అదే ఊపిరిగా జీవనయానం సాగించారు.. ఏదో ఒక రోజు తన కళ కడుపునింపక పోతుందా అంటూ ఎదురుచూశారు.. 76 ఏళ్ల జీవితంలో వెను తిరిగి చూస్తే వేల ప్రదర్శనలు.. అయితే ఆయన నమ్మ కమే నిజమైంది.. తన కళ కడుపునింపేటంత పద్మశ్రీ అనే బిరుదును తెచ్చింది.. అయితే ఆ ఆనందాన్ని పంచుకోవడానికి.. ఆ పురస్కారం అందుకోవడానికి మిరియాల అప్పారావు మన మధ్యన లేరు.. ఆయన కుటుంబ పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా ఎన్నో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.

- (ఆంధ్రజ్యోతి/ రావులపాలెం)

బుర్రకథ.. ఊపిరిగా..

మన పద్మశ్రీ మిరియాల అప్పారావు



కళ కళ కోసం ప్రజల కోసం.. అనే అన్వయం కచ్చితంగా బుర్రకథకు దక్కుతుంది. ఎందుకంటే మనకున్న జానపద కళారూపాల్లో హరికథ తర్వాత చాలా ముఖ్యమైన గాన ప్రక్రియ. మన తెలుగువాళ్లు ఈ కథా ప్రక్రియను ఎంత ప్రభావవంతంగా వినియోగించుకున్నారంటే జానపద, పౌరాణిక కథల నుంచి వీరోచిత ఉద్యమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాల వరకు అత్యద్భుతంగా బుర్రకథ ఒదిగిపోయింది. ఇలా ఒదిగిపోవడానికి బుర్రకథా పితామహుడిగా షేక్ నాజర్ వేసిన పునాదులు అటువంటివి. ఆయనకు ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చి గౌరవించింది. అలనాటి బుర్రకథకుల్లో రావులపాలెంనకు చెందిన మరొక ఆణిముత్యం మిరియాల అప్పారావు. ఇటీవల మరణించిన ఆయనకూ పద్మశ్రీ ప్రకటించింది. ప్రభావంతమైన కథనంతోపాటు చతురతతో కూడిన హాస్యం, వినోద సంభాషణలతో రాగయుక్తమైన విన్యాసాల మధ్య సాగే బుర్రకథ.. కొన్ని దశాబ్దాలపాటు తిరుగులేని కళగా చరిత్ర సృష్టించింది. దీనికి కారణం ఒక నాజర్.. ఒక మిరియాల.. ఇంకా ఎందరో..

ఇప్పుడు నాణేనికి రెండో వైపు చూద్దాం. దాదాపు అయిదు దశాబ్దాలపాటు బుర్రకథే ప్రాణంగా మిరియాల అప్పారావు చివరి వరకు అదే తపనతో జీవించారు. ఇక్కడ మరొక ఆసక్తికరమైన విషయమేమిటంటే.. ఆయన కుటుంబం యావత్తూ ఇదే రంగంలో ఉండి జీవనం సాగిస్తుండడం. కాకపోతే వేలాది ప్రదర్శనలు ఇచ్చిన కళాకారుల కుటుంబాలు ఏ స్థాయిలో ఉన్నాయో చూద్దామని ప్రయత్నిస్తే చాలాసార్లు మనకు నిరాశే ఎదురవుతుంది. దానికి కారణం ఆ కళనే నమ్ముకుని, ముందు తరం వారసులుగానే తమ జీవితాలను కొనసాగించడానికి వారు శక్తినంతా ధారపోయడమే ఒక శాపమవుతోంది. ఈ నేపథ్యంలో వీరి కృషి కళారంగానికి ఎనలేని సేవ అనాలా.. కళనే నమ్ముకుని తమ 'భవిష్యత్తు'ని ధారపోసిన త్యాగమూర్తులనాలా..

ఇంటిల్లపాదీ బుర్రకథకులే..

కళను నమ్ముకుని ఎన్నో ప్రదర్శనలు ఇస్తూ గుర్తింపు తెచ్చుకున్న బుర్రకథ కళాకారులకు ఇవాళ ఆదరణ లేదు. కేవలం సామాజిక చైతన్య కార్యక్రమాల కోసమే ఈ కళారూపం అన్నట్టుగా మారిపోయింది. ఒక కుటుంబం ఐదు దశాబ్దాలపాటు బుర్రకథ కళారంగంలోనే జీవితం సాగించింది. ఒకరిద్దరు కాదు, ఇంటిల్లపాదీ ఇదే రంగానికి తమ జీవితాలను అంకితం చేసింది. యజమాని నుంచి కూతుర్లు, కొడుకులూ అందరూ ఇదే జీవనం. 50 ఏళ్లుగా.. వేలాది ప్రదర్శనలు.. సత్కారాలు, ప్రశంసలు, బిరుదులు.. హోరెత్తిన జనం చప్పట్లు..ఇవన్నీ దాటుకుని వచ్చిన ఈ కళాకార కుటుంబానికి ఇప్పుడు అష్టకష్టాలు. ప్రముఖ బుర్రకథ కళాకారుడు మిరియాల అప్పారావు. ఇటీవలే ఆయనకు పద్మశ్రీ లభించిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని పలకరించినప్పుడు వెల్లడైన అనేక విషయాలు, కుటుంబ స్థితిగతులపై ప్రత్యేక కథనం.

స్మృతిచిహ్నం ఏర్పాటుచేయాలి

ఇంతటి కళాకారుడు తమ మధ్యన తిరగడం మా అదృష్టం అంటున్నారు రావులపాలెం ప్రజలు.. ఆయన స్మృతి చిహ్నం ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. ఆయన ఇంటి చెంతనే ఉన్న పార్కులో మిరియాల అప్పారావు విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వాస్తవ కథ విందాం...

మిరియాల అప్పారావు. ఈయనది కాకినాడ జిల్లా నడకుదురు. 1949లో మిరియాల వెంకట రామయ్య, తిరుపతమ్మలకు జన్మించారు. 1969లో బుర్రకథపై ఉన్న ఆసక్తితో ఇందులో అరంగ్రేటం చేశారు. డ్రాయింగ్ మాస్టర్ జూనియర్ నాజర్, రామిశెట్టి వీరేశం దగ్గర శిష్యరికం చేశారు. తర్వాత తనదైన వాక్చాతుర్యంతో, గాన మాధుర్యంతో బుర్రకథ కళాకారుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1974లో ఆలిండియా రేడియోలో, 1994లో దూరదర్శన్‌లో ఇచ్చారు. 1975లో పెద్దాపురంలో నిర్వహించి బుర్రకథల పోటీల్లో ప్రథమస్థానం సాధించి 50 తులాల వెండికప్ గెలుచుకున్నారు. 5వేలకు పైగా స్టేజీ ప్రోగ్రామ్‌లు, 365 రోజుల్లో 300 రోజులు బుర్రకథ ప్రదర్శనలతో రికార్డు సాధించారు. భార్య నాగమణితో పాటు తన ఏడుగురు సంతానంతో కలిసి బుర్రకథలను చెబుతూ వచ్చారు. అంతే కాకుండా షణ్ముఖ ఆంజనేయరాజుతో కలిసి పలు నాటకాల్లోనూ నటించారు. కళారంగంలో ఆయన ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అప్పారావుకు పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. పద్మశ్రీ ప్రకటించే సమయానికి ఆయన మరణించడం, ప్రకటించిన రోజు దశదినకర్మ రావడంతో కుటుంబ సభ్యులకు పద్మశ్రీ వచ్చిందని ఆనందంగా ఉన్నప్పటికీ, అవార్డు గ్రహీత మరణం ఆ కుటుంబ సభ్యులను తీవ్ర ఆవేదననూ కలిగించింది.

ఇదీ కుటుంబ నేపథ్యం..

పద్మశ్రీ అవార్డు దక్కించుకున్న మిరియాల అప్పారావుకు భార్య నాగమణి, నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. సుబ్బరాజు, బ్రహ్మాజీ, మిరియాల సిద్ధయ్య, బాబా, వీరనాల పద్మావతి, వీరనాల లలిత, యడవల్లి శ్రీదేవి. వీరిలో శ్రీదేవి తాడేపల్లిగూడెంలో ఉండగా మిగిలిన వారంతా రావులపాలెంలోనే ఉంటున్నారు. అప్పారావు తన 50 ఏళ్ల ప్రస్థానంలో 25 ఏళ్ల కిందట రావులపాలెంలో సొంతింటిని నిర్మించారు. ప్రస్తుతం ఆ ఇంటిలోనే నలుగురు కుమారులు తమ కుటుంబాలతో ఉండడం విశేషం.

చిన్న డాబా ఇల్లే ఆస్తి

76 ఏళ్ల కళాప్రయాణం..వేల ప్రదర్శనలు.. ఆయనకు ఉన్నది మాత్రం రావులపాలెంలో పార్కు వద్ద 4 సెంట్లు అంటే అంటే సుమారు 200 గజాల స్థలం.. ఆ స్థలంలోనే సుమారు 30 ఏళ్ల కిందట కట్టిన రెండు పోర్షన్ల చిన్న డాబా ఇల్లు.. అదే ఆస్తి.. ప్రస్తుతం ఆ చిన్న ఇంటిలోనే మిరియాల అప్పారావు నలుగురు కుమారులు సుమారు 20 మంది కుటుంబీకులు నివాసం ఉంటున్నారు.. తండ్రి వారసత్వంగా వచ్చిన బుర్రకథ కళనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు.. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని కుటుంబీకులు వేడుకుంటున్నారు.



కుటుంబంతో మిరియాల అప్పారావు (ఫైల్)

చివరి కోరిక ఇదే..

ఆయన ధ్యాస.. శ్వాస బుర్రకథ.. అందుకే చివరి కోరిక కూడా అదే.. బుర్రకథ కోసం ఓ సంస్థను నెలకొల్పి నేర్పించాలన్నది ఆయన చివరి కోరిక. తరచూ కుమారులకు అదే చెబుతుండేవారట.. ఆ కోరిక తీరలేదు. బుర్రకథకు ఆదరణ తగ్గిన నేపథ్యంలో ఆ అవకాశం కలగలేదు.. ప్రభుత్వం ఆ అవకాశం తమకు కల్పించాలని కుమారులు వేడుకుంటున్నారు.. ప్రభుత్వం సహకరిస్తే బుర్రకథ కళను నలుగురికి నేర్పించి.. తమ తండ్రి చివరి కోరిక తీర్చుతామని చెబుతున్నారు.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సహకరించాలని కోరుతున్నారు.

నాన్న లేకపోవడం బాధగా ఉంది..



మా నాన్నగారు కళకోసం ఎంతో శ్రమించారు.. మా కంటే బుర్రకథనే ఎక్కువగా ప్రేమించారు. ఆయన శ్రమకు ఈనాటికి ఫలితం లభించింది. కానీ ఆయన నేడు మా మధ్య లేకపోవడం బాధగా ఉంది. కళ కోసం ఎంత కష్టపడ్డారో నేను దగ్గరగా చూశా.. ఇప్పటివరకూ ఆయన 5 వేల ప్రదర్శనలు ఇచ్చారు. నేను పదవతరగతి వరకూ చదువుకున్నా.. ఆ తరువాత నాన్నగారి ప్రమేయంతో కళారంగంలో అడుగుపెట్టా.
- మిరియాల సుబ్బరాజు, కుమారుడు

ప్రభుత్వం మాకు దారి చూపాలి..



బుర్రకథకు ఆదరణ తగ్గిపోయింది.. కళాకారుల కష్టానికి తగ్గ పారితోషికం దొరకకపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. ఒకప్పుడు గణపతి, దేవినవరాత్రుల పర్వదినాలు, జాతర్ల సమయాల్లో ఆయా రోజుల్లో ప్రత్యేకంగా బుర్రకథ కళాకారులతో స్టేజీ ప్రోగ్రామ్‌లు చేయించేవారు. కానీ నేడు అలా లేదు.. బుర్రకథలకు ఆదరణ లేక కళాకారుల జీవన మనుగడ కష్టతరంగా మారింది. మా పరిస్థితి అలాగే ఉంది.. ప్రభుత్వమే దారి చూపాలి. - మిరియాల బ్రహ్మజీ, కుమారుడు

నాన్నబాటలో నడిచాం కానీ..?



చినప్పటి నుంచి మా నాన్న అడుగుజాడల్లోనే నడిచాం. బుర్రకథపై ఉన్న మక్కువతో ఈ రంగంలో స్థిరపడినప్పటికీ ప్రస్తుతం ఆదరణ కనుమరగవ్వడం బాధగా ఉంది. బుర్రకథ ఏర్పాటు చేసే నిర్వాహకులు తగ్గిపోయారు. అరకొరగా ఇచ్చే ప్రదర్శనలకు రూ.3 వేల నుంచి రూ.5 వేలు మాత్రమే వస్తున్నాయి. ఆ కొంత మొత్తం కథ చెప్పిన ముగ్గురు, పంచుకోవాల్సి వస్తోంది. ఈ వయసులో వేరే వృత్తుల వైపు వెళ్లలేక ఇబ్బందికర జీవనం సాగిస్తున్నాం. - వీరనాల లలిత, కుమార్తె

వచ్చే నెలా.. అరకొరే !



- ఇంతవరకూ జిల్లాకు కందిపప్పు కేటాయింపు నిల్
- 20 శాతం మందికి మాత్రమే అందే అవకాశం
- పండగ ముందు 30 శాతం లబ్ధిదారులకే అందిన పప్పు
- జిల్లాకు 500 టన్నుల అవసరం

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని రేషన్ కార్డుదారులకు ఫిబ్రవరి నెలలో కూడా కందిపప్పు అరకొరగానే అందనుంది. సంక్రాంతి నెలలో పూర్తిస్థాయిలో సరఫరా కాని విషయం తెలిసిందే. దీంతో వచ్చేనెల కూడా 20 శాతం మంది మాత్రమే పొందనున్నారు. గుజరాత్ నుంచి నాణ్యత లేని సుమారు 200 టన్నుల పప్పు రావడంతో తిరిగి పంపించేశారు. ప్రస్తుతం కొత్త టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందే అవకాశం లేదు. పప్పును తిరిగి పంపించేయడంతో ఈ నెలలో కొరత ఏర్పడిన సంగతి తెలిసిందే. గత నవంబరు నెల నుంచి ప్రతి కార్డుదారుడుకి రూ.67కే కేజీ కందిపప్పు ఇస్తున్నారు. బయట మార్కెట్‌లో రూ. 110 నుంచి 180 వరకూ విక్రయిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ సబ్సిడీపై రూ.67కే నాణ్యమైన పప్పు అందివ్వడంతో ప్రజలంతా చాలా సంతోషించారు. గత వైసీపీ ప్రభుత్వం 2023 నుంచి కందిపప్పు ఇవ్వడం మానేసింది. పైగా ఎవరూ కందిపప్పు తినడం లేదని ప్రచారం కూడా చేసింది. కానీ గత ఎన్నికలలో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం గత ఏడాది నవంబరు నెల నుంచి మళ్లీ అందిస్తూ వచ్చింది. కానీ జనవరిలో నాణ్య మైన పప్పు రాకపోవడం వల్ల జిల్లాకు కేవలం 60 శాతం కందిపప్పు మాత్రమే కేటాయించారు. అందులో జిల్లాలోని గోపాలపురం, నిడదవోలు, కోరుకొండ, బొమ్మూరు, బిక్కవోలులో ఐదు ఎంఎల్ పాయింట్లు ఉన్నాయి. ప్రభుత్వం పౌరసరఫరా సంస్థకు కేటాయిస్తే, అక్కడ నుంచి ఎంఎల్ పాయింట్లకు సరుకు వస్తుంది. అక్కడ నుంచి మండలాల వారీ ఆయా రేషన్ డిపోలకు సరఫరా అవుతుంది. అయితే వివిధ కారణాల వల్ల జనవరిలో కూడా జిల్లాకు కేవలం 60 శాతం మాత్రమే కేటాయించారు. అందులో సుమారు దాదాపు ఎనిమిది లారీలలో వచ్చిన సుమారు 200 టన్నుల కందిపప్పు పాడైపోవడంతో తిరిగి పంపించారు.ఈ పరిస్థితులలో జిల్లాలో కేవలం 30 శాతం నుంచి 35 శాతం మంది లబ్ధిదార్లకే అందింది. జిల్లాకు కేటాయించిన పప్పులో ఐసీడీఎస్‌కు, గర్భవతులకు కూడా పప్పు పంపిణీ చేయ వలసి ఉంది. ప్రస్తుతం అధికారులు అంగన్‌వాడీలు, గర్భవతులకు పప్పు కొరత లేకుండా చూడగలుగుతున్నారు. కానీ జిల్లాలో రేషన్‌కార్డుల ద్వారా పొందే వారికి మాత్రం ఇవ్వలేకపోతున్నారు. జిల్లాలోని 5 లక్షల 75 వేల మంది రేషన్‌కార్డు దారులకు ఒక్కో కార్డుకు ఒక కేజీ వంతున పంపిణీ చేయవలసి ఉంది. కానీ కేవలం 30 శాతం మందికే పప్పు అందడంలో అందరూ పండగ రోజున అసంతృపి చెందారు.. కొంత పప్పు మాత్రమే రావడం వల్ల పండగ ముందు రోజులలో కొంతమందికి బాగానే సరిపెట్టారు. తర్వాత రోజులలో ఎవరికి పప్పు అందలేదు. గతనెల కోటా కింద ఆలస్యంగా సుమారు 60 టన్నుల వరకూ కందిపప్పు వచ్చింది. అందులో అంగన్‌వాడీలు, గర్భిణులకు సరిపెట్టగా, మిగిలినది ఫిబ్రవరి నెలలో పంపిణీ చేయనున్నారు. గతనెలలో కందిపప్పు పూర్తిగా అందని రాజానగరం మండలంలో వచ్చేనెలలో పూర్తిగా పంపిణీ చేయనున్నారు. జిల్లాలో మిగతా చోట్ల గత నెలలో అందని వారికి వచ్చేనెలలో ఉన్నంత మేర పంపిణీ చేసే ప్రయత్నాల్లో అధికారులు ఉన్నారు. గతనెల కోటా కింద ఇంకా 110 టన్నులు పప్పు రావలసి ఉంది. అదికాక ఫిబ్రవరి కోటా కింద 500 టన్నులు రావాల్సి ఉంది. సాధారణంగా ప్రతినెలా 1వ తేదీ నుంచి 15లోపు ఎంఎల్ పాయింట్లకు పప్పు వస్తుంది. దానిని ప్రతినెలా 20 నుంచి 25 వరకు ఒక విడతగా, 25 నుంచి 30 లోపు రెండో విడతగా రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనాలకు అందిస్తారు. ఈనెల ఇంతవరకూ జిల్లా కు కేటాయింపులు రాకపోవడంతో వచ్చేనెలలో కేవలం 20 శాతం మందికి పప్పు అందేటట్టయినా చేయాలనే ప్రయత్నాలు చేస్తున్నారు.

'ఆదిత్య'లో జాతీయస్థాయి
ఐడియా థాన్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదిత్య ప్రో ఛాన్సలర్ సతీష్‌రెడ్డి

గండేపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలంలోని సూరంపాలెం ఆదిత్యలో ఈనెల 30, 31 తేదీల్లో ఐడియాథాన్ జాతీయ స్థాయి కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ఏఐసీటీ హబ్ ఫౌండేషన్, టెక్కీబాట్ సంస్థల భాగస్వామ్యంతో జరగనుంది. రెండురోజుల ఐడియా థాన్‌లో దేశ వ్యాప్తంగా 300కు పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పరిశ్రమ 4.0 సాంకేతికతలను ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, ఆటోమొబైల్ ఆటోమేషన్ మొదలైన వాటిని ఉపయోగించి వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించేందుకు తమ సృజనాత్మక ఆలోచనలు ప్రదర్శిస్తున్నారు. ఈ వేడుక ద్వారా దేశంలో ఉన్న ప్రతిభా లక్షణాలను, జ్ఞానాన్ని, సాంకేతికతలను సమీకరించి, యువతకు పరిశ్రమ 4.0 నైపుణ్యాలను నేర్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆదిత్య ప్రో ఛాన్సలర్ డాక్టర్ సతీష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజేష్‌కుమార్ అడ్డ టీహబ్ సీఈవో, టెకీబోట్ ఫౌండర్ సీఈవో నల్లమిల్లి వెంకటరెడ్డి హాజరయ్యారు.

నేనే ముందు..



జాతీయ రహదారి ఎర్రకోనేరు వద్ద భారీ లోడుతో వెళుతున్న ట్రాలీ లారీ

- జాతీయ రహదారిపై భారీ లోడ్‌తో ట్రాలీ లారీ
- రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు

తుని రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపైకి 42 అడుగుల వెడల్పు, 42 అడగుల ఎత్తుతో కూడిన పెద్ద బాయిలర్‌తో జాతీయ రహదారిపై ఒక వాహనం రావడంతో వెనుక ప్రయాణించే వాహనాలు పూర్తిగా నిలిచిపోయిన పరిస్థితులు ఎదురయ్యాయి. విదేశాల నుంచి కాకినాడ పోర్టుకి దిగుమతి అక్కడ నుంచి ఒడిశాకి ఒక భారీ ట్రాలీ లారీపై లోడ్ అయ్యి ఒడిశా వైపుకి 16వ నెంబరు జాతీయ రహదారి మీదుగా బయలుదేరింది. హైవే అథారిటీ సిబ్బంది రోజుకు 18 కిలోమీటర్ల మేర ప్రయాణించేందుకు అనుమతులు జారీ చేయడంతో వివిధ శాఖల అధికారులుసమన్వయంతో ఈ వాహనాన్ని ముందుకు నడిపించారు. ఇది రహదారిపై నడిచే క్రమంలో వెనుక ఉన్న వాహనాలు ముందుకు కదిలేందుకు వీలు లేకపోవడంతో పెద్దఎత్తున ట్రాఫిక్‌జామ్ అయ్యింది. రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు, అది కారులు అసహనం వ్యక్తంచేశారు. ఈ వాహ నం రాకతో జాతీయ రహదారిపై కరెంటు నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ చైర్మన్‌గా వైడీ రామారావు



రామారావును సత్కరిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖ నూతన చైర్మన్‌గా కాకినాడ జిల్లాశాఖ చైర్మన్‌గా ఉన్న వైడీ రామారావు ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్య నిర్వాహకవర్గ సమావేశంలో రామారావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు చైర్మన్‌గా ఉన్న డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి రాజీనామా కారణంగా ఏర్పడిన ఖాళీలో రామారావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత 26 సంవత్సరాలుగా రెడ్‌క్రాస్‌తో అనుబంధం కలిగి 8 సంవత్సరాలుగా ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా శాఖ, కాకినాడ జిల్లా శాఖ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రామారావు అత్యున్నత జాతీయ రెడ్‌క్రాస్ పురస్కారం రాష్ట్రపతి బంగారు పతకాన్ని, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ జిల్లా శాఖ పురస్కారాలను పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వైడీ రామారావును రెడ్‌క్రాస్ సభ్యులు, ప్రముఖులు అభినందించారు.

2న హాకీ మహిళా జిల్లా జట్టు ఎంపిక

కాకినాడఅర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి); రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు హాకీ ఉమ్మడిజిల్లా మహిళా జట్టు ఎంపిక ఫిబ్రవరి 2న కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో నిర్వహిస్తారని హాకీ సంఘ జిల్లా కార్యదర్శి నంబూరి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైనవారు వచ్చేనెల 8నుంచి నెల్లూరులో జరిగే సీనియర్ మహిళా హాకీ రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు.క్రీడాకారులు 2న హాకీ స్టేడియంలో హాజరుకావాలన్నారు.

అంతర్జాతీయ సదస్సులో పిఠాపురం కవికి సత్కారం



చెన్నైలో జరిగిన అంతర్జాతీయ తెలుగు సదస్సులో పిఠాపురం కవి చిందాడ చిన్నోడును సత్కరిస్తున్న దృశ్యం

పిఠాపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): చెన్నైలో జరిగిన అంతర్జాతీయ తెలుగు సదస్సులో పిఠాపురం కవికి సత్కారం లభించింది. మద్రాసు యూనివర్సిటీలోని మద్రాసు తెలుగుశాఖ ఆధ్వర్యంలో మెరీనా ఆవరణలో రెండు రోజుల పాటు ఈ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పిఠాపురం పట్టణానికి చెందిన ప్రముఖ కవి, విమర్శకు డు, రచయిత చిందాడ చిన్నోడు హాజరయ్యారు. ఇందులో భాగంగా జరిగిన తొలి తరం ముస్లిం కవి, ఆధ్యాత్మికవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు బ్రహ్మర్షి ఉమర్‌ఆలీషా సాహిత్యం-బహుముఖీనత సదస్సులో డాక్టర్ ఉమర్ ఆలీషా వారి ఖండకావ్యములు-సామాజిక సందేశం అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. ఇదే అంశంపై సదస్సులో ప్రసంగించారు. ఈ సందర్భంగా చిన్నోడును మద్రాసు యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు తదితరులు సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నోడును సదస్సులో పాల్గొన్న పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా, సినీ గేయ రచయిత భువనచంద్ర, వ్యాసిలి వసంతకుమార్, డాక్టర్ పాండురంగం కాళియప్ప తదితరులు అభినందించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో ఆరుగురు ఏపీటీ విద్యార్థులకు ఉద్యోగాలు

- ఒక్కొక్కరికీ రూ.9.02 లక్షల వార్షిక వేతనం



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జనార్ధనరావు

కాకినాడరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాధపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో టెక్సాస్ ఇనుస్ట్రుమెంట్స్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లి జనార్ధనరావు తెలిపారు. ఒక్కొక్కరికీ రూ.9.02లక్షల వార్షికవేతనం లభించనుందన్నారు. పి.సాయిఅలేఖ్య, ఆర్.అనూష, జి.సిద్ధు, ఏ.లక్ష్మీగణపతి, వి.వంశీకృష్ణ, వి.సిద్ధార్థలు ల్యాబ్‌టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు.ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంతటివేతనంతో ఉద్యోగాలు లభించడంలేదన్నారు. ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగంలో విద్యార్థులు ఈఘనత సాధించారన్నారు. విద్యార్థులను టీపీవో, ప్రిన్సిపాల్ అభినందించారు.

డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసేందుకు పాదయాత్ర

గొల్లప్రోలు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసేందుకు శ్రీకాకుళంజిల్లా రణస్థలం మండలం బవరాజుపాలెం నుంచి ఒక కుటుంబం పాదయాత్రగా మంగళగిరి బయలుదేరారు. వీరు గురువారం సాయంత్రం గొల్లప్రోలు టోల్‌ప్లాజా సమీపంలోని వైజంక్షన్ వద్దకు చేరుకున్నారు. భార్యాభర్త కలిసి ఈ పాదయాత్ర చేపట్టారు. బవరాజుపాలెం దారు బంద ట్యాంకు సర్వే నెంబరు 10లో 1.50 ఎకరాల భూమికోసం తమ కుటుంబం 35 ఏళ్లుగా పోరాటం చేస్తున్నదని, మాకు మీరే న్యాయం చేయాలంటూ ఉన్న ఫ్లెక్సీని పట్టుకుని వారు పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పవన్‌ను రెండుసార్లు కలిశామని, ఈసారి మంగళగిరిలో స్వయంగా కలిసి మరోమారు విన్నవించనున్నట్లు వారు తెలిపారు. మీ ఆదేశాలను కూడా రెవెన్యూ అధికారులు పాటించడంలేదని ఫ్లెక్సీలో పేర్కొన్నారు.



డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసేందుకు మంగళగిరి పాదయాత్రగా వెళుతున్న కుటుంబం

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

అల్లవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు వైనతేయ వారధిపైనుంచి మంగళవారం గోదావరిలో దూకిఆత్మహత్యకు పాల్పడిన యువకుడి మృతదేహం పాశర్లపూడి వైపున లభ్యమైందని పోలీసులు తెలిపారు. మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జవ్వాది కృపాకిరణ్(25) చెన్నైలోని విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల సొంతూరు వచ్చిన అతడు మంగళవారం బోడకుర్రు బ్రిడ్జిపై తన యాక్సిస్ స్కూటర్ వదిలి గోదావరిలో దూకేశాడు. మృతుడి తండ్రి నాగేశ్వరరావు గతంలో మృతి చెందగా తల్లి సీతకు కృపాకిరణ్ ఒక్కడే కుమారుడు. అతడి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని అమలాపురం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

రైలులో ప్రయాణికురాలి బంగారం గల్లంతు

సామర్లకోట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): లింగంపల్లి నుంచి కాకినాడకు ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తుండగా 8 గ్రాముల బంగారు గాజు పోయిందని ఓ ప్రయాణికురాలు సామర్లకోట రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. చక్రవర్తుల షణ్ముఖరాణి అనే మహిళ గురువారం లింగంపల్లి-కాకినాడ రైలులో ప్రయాణించింది. ప్రయాణంలో చేతికిఉన్న 2బంగారు గాజులను హ్యాండ్ బ్యాగ్‌లో వేసుకుని ఉదయం సామర్లకోటలో రైలు దిగింది. బ్యాగులో చూసుకోగా ఒక గాజు మాత్రమే ఉన్నట్లు గుర్తించి అప్పటికి కాకినాడకు చేరుకున్న రైలులో తాను ఎక్కిన బోగీ గాలించినా బంగారు గాజు ఆచూకీ కనిపించలేదని, 8 గ్రాముల బంగారు గాజు విలువ రూ.80వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది.

భూముల విలువలకు రెక్కలు



- ఫిబ్రవరి 1 నుంచి అమలుకు సన్నాహాలు
- జాతీయ రహదారులు, ఏడీబీ రోడ్డుకు ఇరువైపులా భూముల ధరల పెంపు
- 10నుంచి 20శాతం వరకూ పెంపుదలకు నిర్ణయం

సామర్లకోట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం భూములు, స్థలాల మార్కెట్ విలువలను పెంచేందుకు కసరత్తు పూర్తి చేసింది. ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెంచిన భూముల విలువలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్, ఐజీ కార్యాలయంనుంచి ఉత్తర్వులందాయి.

నెల క్రితం వాయిదా

డిసెంబరు నెలలో రాష్ట్ర ఐజీ కార్యాలయం నుంచి అందిన ఆదేశాల మేరకు ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్థానిక సంస్థల కమిషనర్లతో వార్డులవారీగా భూముల విలువలు పెంపుదలకు కార్యాచరణ పూర్తిచేశారు. జనవరి 1నుంచే పెంపుదల విలువలను అమలుకు అప్పట్లో నిర్ణయించినా ప్రభుత్వం వాయిదా వేసింది. తిరిగి నెలరోజుల అనంతరం భూముల విలువలు పెంపుదలకు తాజాగా ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చి ఫిబ్రవరి 1నుంచి అమలుకు ప్రకటన చేశారు. గతంలో స్పెషల్ రివిజన్‌లో అధిక పెంపును సవరిస్తూ స్థిరాస్తిదారులకు భారం కాని విధంగా 10 నుంచి 20 శాతం మేర మాత్రమే భూముల ధరలు పెంచి ఫిబ్రవరి 1 నాటికి పెంచిన ధరలతో రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే తరువాయిగా మారింది.

10శాతంపైనే పెంపునకు నిర్ణయం

బహిరంగ మార్కెట్లో భూములకు విలువలు అధికంగా ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ విలువలు చాలా తక్కువగా ఉంటాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ప్రభుత్వం ప్రజావసరాలకోసం భూములను కొనుగోలు చేసే సందర్భాల్లో భూములు అమ్మేవారు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో ఈసారి మార్కెట్ విలువలను జిల్లాలో 10శాతం నుంచి 35శాతం పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. అందుకు తగ్గట్లుగా రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు నివేదికలు తయారుచేశారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలోని అందరు మున్సిపల్ కమిషనర్లతోను, పంచాయతీ ఉన్నతాధికారులతోను గత డిసెంబరులో 19న కాకినాడలో సమావేశం నిర్వహించారు.

ఆ భూముల ధరలు పెంపు

చాన్నాళ్లుగా భూముల మార్కెట్ విలువలు పట్టణ ప్రాంతాలు, కమర్షియల్‌గా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జరిగే ప్రాంతాల్లో మాత్రమే భూములు, స్థలాల ధరలు పెంపు జరుగుతోంది. ప్రతిఏటా జనవరి, మార్చి నెలల్లో ధరలు పెంచడం రిజిస్ట్రేషన్ శాఖకు ఆనవాయితీ. కానీ ఈ దఫా గత ప్రభుత్వ హయాంలో అధిక పెంపును సవరిస్తూ జాతీయ రహదారులు, ఏడీబీ రోడ్డులకు ఇరువైపులా భూముల విషయంలో ధరల పెంపుదలకు ఉమ్మడి తూర్పు జిల్లాలో పెద్దకసరత్తు చేసినట్లు తెలుస్తోంది. జాతీయ రహదారులు, ఏడీబీ రోడ్డుల్లో ఇరువైపులా భూముల్లో అనధికారికంగా కమర్షియల్‌గా కోట్ల రూపాయలతో నిర్మాణాలు సాగుతున్నాయి. భూముల ధరలు ఎకరానికి రూ.60 నుంచి రూ.80 లక్షలకు మించేవికావు. ఇదే భూములను కమర్షియల్‌గా లెక్కిస్తే బహిరంగ మార్కెట్‌లో ఎకరం ధర అక్షరాలా రూ.5కోట్ల నుంచి రూ.8కోట్ల పై మాటే. దీనివల్ల రిజిస్ట్రేషన్‌శాఖ రాబడికి పెద్ద ఎత్తున గండిపడుతోంది. రైతులకు తమ వ్యక్తిగత అవసరాలకోసం బ్యాంకుల్లో అధిక మొత్తంలో రుణాలు దక్కని పరిస్థితిని కూటమి ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్నట్లు తెలుస్తోంది.

ఎల్‌పీ నెంబర్లతో రిజిస్ట్రేషన్ల రాబడికి..

జగనన్న భూరక్ష పేరిట భూముల రీసర్వే తప్పుల తడకగా సాగింది. రైతులకు సంబంధించిన భూములకు సర్వే నెంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్(ఎల్‌పీ) నెంబర్లు కేటాయించారు.ఆభూమిని రైతు తన ఇబ్బందుల రీత్యా కొంత అమ్ముకుంటే ఆ భూమిని కొన్న వ్యక్తులకు భవిష్యత్తులో రెవెన్యూ రిజిస్ట్రేషన్ల కష్టాలు తప్పడం లేదు. దీంతో రీసర్వేలో అనాలోచిత నిర్ణయాలతో ఎల్‌పీ నెంబర్లు కేటాయించిన జిల్లాలో కొన్ని గ్రామాల్లో స్థిరాస్థిదారులు పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఈ సమస్యలను పరిష్కారానికి అధికారులు ముందుకు రాలేదు. రెవెన్యూసదస్సుల్లో ఎల్‌పీ నెంబర్ల విధానం సవరణలపై ఫిర్యాదులందినట్లు తెలుస్తోంది.

ఫిబ్రవరి 1 నుంచి..

జిల్లాలో అన్నిముఖ్యమైన ప్రాంతాల్లో సెంటు (48 చదరపు గజాలు) భూమి విలువ బహిరంగ మార్కెట్లో రూ.వేలల్లో, లక్షల్లో ఉంటుంది. కానీ, ఎకరా భూమి రూ.5కోట్ల వరకూ పలుకుతోంది. రిజిస్ట్రేషన్‌శాఖ మార్కెట్ విలువలు మాత్రం రూ.వేలు, లక్షలు దాటడం లేదు. దీంతో భూములు మార్కెట్ విలువల పెంపుపై ప్రభుత్వం దృష్టిసారించింది. జిల్లాలో చాలా ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలుగా మార్పు చెందాయి. సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకోసారి రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతారు. ఈసారి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోను ఈ విలువలు పెరగనున్నాయి. గత డిసెంబరు నెల 20న భూముల విలువల పెంపుదల పత్రాలను ఆయా ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారు. ప్రజల అభిప్రాయాలను సైతం సమీకరించింది. ఫిబ్రవరి 1 నుంచి పెంచనున్న మార్కెట్ విలువలను అమలులోకి తీసుకురానున్నారు. రాజానగరం ఏడీబీ రోడ్డు నుంచి సామర్లకోట మండలం అచ్చంపేట జంక్షన్ వరకూ రోడ్డుకు ఇరువైపులా ఎకరా భూమి బహిరంగ మార్కెట్‌లో రూ.8కోట్లనుంచి రూ.10 కోట్ల వరకూ ధర పలుకుతుంది. ప్రభుత్వ ధర మాత్రం రూ.60లక్షలనుంచి రూ.80లక్షల వరకూ మాత్రమే ఉంది. పెద్దాపురం ఏడీబీ రోడ్డులో సైతం ఎకరాకు రూ.25లక్షలలోపు మాత్రమే ఉంది. ఇదే రీతిలో పలు పట్టణ ప్రాంతాల్లో కూడా చదరపు గజాల మార్కెట్ ధరలు రూ.9వేలలోపు మాత్రమే ఉండగా మూడు రెట్లు అదనంగా ధరలు పలకడం గమనార్హం.

టిస్‌లో తప్పుల మార్పుకు మరో అవకాశం

- నేటి సాయంత్రంలోపు చేసుకోవాలి
- కాకినాడ జిల్లా డీఈవో రమేష్

కాకినాడరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పాఠశాల డైరెక్టర్ ఆదేశాల ప్రకారం కాకినాడ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా వారి టిస్(టీఐఎస్) పూర్తి వివరాలను www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో వ్యక్తిగత హాజరు యాప్ లాగిన్ ద్వారా నమోదు చేసుకున్నారు. ఆ వివరాల్లో ఏమైనా తప్పులుంటే మార్పులు చేసుకోవడానికి పాఠశాల విద్యాశాఖ మరో అవకాశం కల్పించినట్లు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులంతా వారి వివరాల్లో తప్పులేమైనా ఉంటే శుక్రవారం సాయంత్రంలోపు మార్పులు చేసుకోవాలన్నారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.33కోట్లు

అన్నవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కించగా రూ.1,33,16,044 నగదు, 62 గ్రాముల బంగారం, 525 గ్రాముల వెండి లభించాయి. వీటితోపాటు యుఎస్‌ఏకు చెందిన 369 డాలర్లు, ఇండోనేషియా 1200000 ఇండోనేషియన్ రుపియా, ఆస్ట్రేలియా 100 డాలర్లు, సింగపూర్ 50 డాలర్లు, ఇంగ్లాండ్ 65 పౌండ్స్‌ను భక్తులు హుండీల్లో వేశారు. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 30రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన భక్తులు రోజుకు రూ.4.43లక్షలు సమర్పించినట్లు అధికారులు వెల్లడించారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి హత్య



చంద్రశేఖర్ మృతదేహం

- మరో వ్యక్తితో కలిసి సహజీవనం చేస్తోన్న ప్రియురాలు
- చిరునామా తెలుసుకుని వచ్చి ఘర్షణ పడిన ప్రియుడు
- ఇనుప దస్తాతో మోది కడతేర్చిన యువతి
- కాకినాడలో ఘటన

కాకినాడ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తిని ప్రియురాలే కడతేర్చిన సంఘటన గురువారం కాకినాడలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతంలోని చినమల్లంకు చెందిన గుడాల చంద్రశేఖర్‌స్వామి(30) రావులపాలెంలో ఉంటూ వ్యవసాయ కూలీగా పని చేసేవాడు. ఈ క్రమంలో అతనికి రావులపాలేనికి చెందిన 25ఏళ్ల మునిస్వామిలావణ్యతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా సహజీవనానికి దారి తీసింది. ఆమెకు అప్పటికే చిత్తూరుజిల్లాకు చెందిన బాలు అనే వ్యక్తితో వివాహమై ఇద్దరు పిల్లలు పుట్టాక విడిపోయారు. కాగా చంద్రశేఖర్‌స్వామికి తెలియకుండా లావణ్య ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేసే మరో వ్యక్తి లోవరాజుతో సహజీవనం చేస్తూ అతడితో కలిసి గుట్టుచప్పుడు కాకుండా రెండునెలల క్రితం కాకినాడలోని డైరీఫారం సెంటర్ స్వర్ణాంధ్రకాలనీలోని టిడ్కో ఇంటిని అద్దెకు తీసుకున్నారు. లావణ్య కాకినాడలో మరో వ్యక్తితో సహజీవనం చేస్తోందని ఆ ఇంటి చిరునామా తెలుసుకుని చంద్రశేఖర్ స్వామి బుధవారం రాత్రి ఆ ఇంటికి వచ్చాడు. అక్కడ లావణ్యతో ఘర్షణ పడ్డాడు. అలా తెల్లవారుజాము వరకు ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో విషయం ఇంతవరకు వచ్చాక తనను చంద్రశేఖర్ అంతం చేస్తాడని గ్రహించిన లావణ్య మసాల దంచే ఇనుప అమస్ దస్తాతో చంద్రశేఖర్ తలపై బలంగా విచక్షణారహితంగా మోదడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఆమె పరారైంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు చంద్రశేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడు తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు పోర్ట్ సీఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులు చేసి.. తీర్చలేక..



ఆత్మహత్యకు పాల్పడిన వరలక్ష్మి మృతదేహం

- పురుగుల మందు సేవించి ఆపై చికిత్స పొందుతూ.. ఆస్పత్రి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య
- తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలంలో ఘటన

అనపర్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆమెది ఓ మధ్య తరగతి కుటుంబం.. అయితేనేం సమాజంలో గొప్పగా బతకాలని కలలు కని.. ఇంట్లో ఏ వేడుక జరిగినా తలకు మించి అప్పులు చేసేది. దాన్ని తీర్చే ధైర్యం లేకపోవడంతో చివరకు తనువు చాలించింది. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం ఊలపల్లికి చెందిన వాశిరెడ్డి వరలక్ష్మి(32) స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తుంది. ఈమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె తన కుమార్తె వేడుక చేసేందుకు స్థోమతకు మించి అప్పులు చేసింది. ఆ అప్పులు తీర్చలేక, ఇచ్చిన వారికి సమాధానం చెప్పలేక మధనపడుతూ మంగళవారం పురుగులమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో బంధువులు ఆమెను అనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సకాలంలో వైద్యమందించి ప్రాణాలను నిలబెట్టారు. చివరకు గురువారం ఉదయం వేకువజామున 4గంటల సమయంలో ఆమె చికిత్స పొందుతున్న ఆస్పత్రి భవనంపైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడగా, వెంటనే అప్రమత్తమైన సిబ్బంది కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అనపర్తి అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

పశువుల ఆరోగ్య పరిరక్షణకే ప్రత్యేక శిబిరాలు

పశుసంవర్ధక శాఖ స్పెషల్ ఆఫీసర్ రాధాకృష్ణ



ప్రదర్శనలో ఉన్న పశువులను పరిశీలిస్తున్న అధికారులు

కిర్లంపూడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పాడి సంపద పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని పశుసంవర్ధక శాఖ స్పెషల్ ఆఫీసర్ రాధాకృష్ణ అన్నారు. కిర్లంపూడి మండలంలోని గోనేడ గ్రామంలో గురువారం లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ జిల్లా జేడీ రామస్వామి ఆధ్వర్యంలో ఉపసంచాలకులు డాక్టర్ అంబేడ్కర్, పెద్దాపురం సంచాలకులు రామస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ రాధాకృష్ణ హాజరయ్యారు. పశువైద్యాధికారి నయీమ్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 36 లేగదూడలను ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శనలో ఎంపికైన వాటికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పశుసంపదను రైతులు పెంచుకోవాలన్నారు. రైతులకోసం ప్రభుత్వం 23,500 గోకుల షెడ్‌లను మంజూరు చేసిందన్నారు. పశువులకు ఇచ్చే ఇంజక్షన్ ధర రూ.1350కుగాను పాడి రైతులకు రూ.500కే అందిస్తున్నామన్నారు. 50 సెంట్లు భూమిలో రెండేళ్లపాటు పచ్చగడ్డి పెంచితే సంవత్సరానికి రూ.32వేల చొప్పున రూ.64వేలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తాయన్నారు. పాడిపశువులకు ఇన్సూరెన్స్ అందిస్తున్నామని, రైతులు రూ.400 కడితే ప్రభుత్వం రూ.1200 జమచేసి మూడేళ్లపాటు ఇన్సూరెన్స్ వర్తించేస్తుందని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మండపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మద్యంలో యాసిడ్ కలుపుకుని సేవించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇది. మండపేట పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ డైరీఫారం సెంటరు వద్ద నివాసం ఉంటూ కోరమండల్ సంస్థలో పని చేసే ఓలేటి గంగాధరం(50) బుధవారం మండపేటలోని బూరుగుంట చెరువు వద్దకు వచ్చాడు. అక్కడ మద్యంలో యాసిడ్ కలుపుకుని సేవించడంతో వెంటనే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు దీన్ని గమనించి 108 వాహనంలో మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ గొడవల కారణంగా గంగాధరం దీనికి పాల్పడినట్టుగా భావిస్తున్నారు. గురువారం చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు అతడి భార్యకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఏఎస్ఐ చిన్నారావు తెలిపారు.

మహిళా పోలీసుపై హోంగార్డు దాడి

ద్రాక్షారామ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్ల మహిళా పోలీసు తనపై హోంగార్డు దాడి చేశాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహిళా పోలీసు వైదాడి ఉమామహేశ్వరి, హోంగార్డు కుమార్‌రాజువద్ద రూ.లక్ష అప్పు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో రూ.లక్ష ఒకసారి, రూ.14వేలు ఒకసారి ఆమె చెల్లించింది. ఈనెల 16న అతడు డబ్బులు అడుగుతూ జుట్టు పట్టుకుని బూతులు తిడుతూ దాడి చేశాడని పోలీసులు తెలిపారు. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి రంపచోడవరం జాబ్‌మేళా రద్దు

పాడేరురూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 31న అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించాల్సిన జాబ్‌మేళాను రద్దు చేస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి డాక్టర్ పి.రోహిణి గురువారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో జాబ్‌మేళాను రద్దు చేశామన్నారు.

కాకినాడలో వ్యక్తి అనుమానాస్పద మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాకినాడ క్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఓ గుర్తు తెలియని వ్యక్తి ఒంటిపై గాయాలతో అనుమానాస్పదంగా మృతి చెందిన గురువారం కాకినాడలో చోటు చేసుకుంది. కాకినాడ డైరీఫాం సెంటర్‌లోని పర్లోవపేట టిడ్కో గృహ సముదాయంవద్ద గురువారం ఉదయం ఓ గుర్తు తెలియని 30ఏళ్ల పురుషుడు విగతజీవిగా రోడ్డు పై పడి ఉన్నాడు. కాగా ఆ విషయాన్ని స్థానిక వీఆర్‌వో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం సంఘటనా స్థలానికి పోర్టు ఎస్‌హెచ్‌ఓ సునీల్‌కుమార్ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి గుండెలపైన, తల వెనుక భాగంలోను గాయాలు ఉండడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. గురువారం తెల్లవారుజాము సమయంలో మృతుడు తూలుతూ నడుచుకుంటూ వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణోత్సవాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి



అంతర్వేది స్వామివారి వార్షికోత్సవంపై మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

- అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్
- అంతర్వేదిలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలపై అధికారులతో సమీక్ష

అంతర్వేది, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అంతర్వేది పుణ్యక్షేత్రంలో జరిగే శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా అధికారులు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. అంతర్వేది ఆలయ పరిసర ప్రాంతాలైన బీచ్, ఫెర్రీ పాయింట్లను పరిశీలించి అనంతరం కల్యాణ వేదిక వద్ద జిల్లాస్థాయి అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్వామివారి ఆలయ ప్రాంతం, బీచ్, బోటు పార్కింగ్ తదితర ప్రాంతాలను భక్తులు సులభతరంగా గుర్తించేందుకు పంచాయతీరాజ్ విభాగం వారు సైన్ బోర్డులు, దేవాలయ ప్రాంగణంలో లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేవస్థానంలో ప్రధాన కమాండ్ కంట్రోల్ రూమ్, స్నానఘట్టాల వద్ద మినీ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్టు తెలిపారు. 21 శాఖల సిబ్బంది 24/7 పనిచేయడం జరుగుతుందని, వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తూ మొత్తం వ్యవస్థను పరీక్షించాలన్నారు. 'ఈ సారి సీసీ కెమెరాలను గత సంవత్సరం కంటే ఎక్కువ ఏర్పాటు చేశాం. బస్టాండు తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం, లైటింగ్ ఏర్పాట్లు, బీచ్ వద్ద సెక్యూరిటీ తదితర ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేపట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రమాదాలకు తావు లేకుండా ఉత్సవాలను విజయవంతం చేయాలి. జిల్లా రవాణాధికారి ఉత్సవాలకు వచ్చే యాత్రికుల వాహనాలు ఓవర్‌లోడ్ లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. ప్రధానంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 20 స్టాల్స్ ఏర్పాటు చేసి తాగునీటిని సమృద్ధిగా అందించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం 120 మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలి. జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఏపీడీ దేవస్థానం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య వ్యవస్థను పర్యవేక్షించాలి. 11 పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తూ కంట్రోల్ రూముకు అనుసంధానించాలి. పారిశుధ్య ప్రక్రియను డీఎల్‌పీవో పర్యవేక్షించాలి. అధికారులు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు ప్రత్యామ్నాయంగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలి. ఆలయం చుట్టుపక్కల నాలుగైదు కిలోమీటర్ల పరిధిలో వీధిలైట్లు సక్రమంగా పనిచేస్తున్నదీ లేనిదీ పరిశీలించాలి. జిల్లా పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు శాఖల అధికారులు సమన్వయంతో ధరల నియంత్రణపై దృష్టి సారించాలి. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉత్సవాల్లో ప్రసాదాలు, ఆహార పదార్థాలను వర్తకులు అమ్మే ఆహార పదార్థాలను పరిశీలించి కల్తీ లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కల్యాణవేదిక వద్ద అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారన్నారు. విధులు నిర్వహించే సిబ్బందికి ముందుగానే పాస్‌లు మంజూరు చేస్తారన్నారు. రథోత్సవ ప్రక్రియను డ్వామా పీడీ పర్యవేక్షిస్తూ వేతన కూలీల సమన్వయంతో పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. కల్యాణోత్సవం, రథోత్సవంలో ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రథం ఫిజికల్ ఫిట్‌నెస్‌ను ధ్రువీకరించాలన్నారు. చక్రస్నాన ప్రక్రియను రామచంద్రపురం ఆర్డీవో అఖిల పర్యవేక్షిస్తారన్నారు. వైద్యఆరోగ్య శాఖ ఐదు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయడంతో పాటు చుట్టుపక్కల ఆసుపత్రులను అత్యవసర సమయంలో వినియోగించే విధంగా మ్యాపింగ్ చేయాలన్నారు. ఆర్టీసీ 105 బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తూ ప్రయాణికుల రాకపోకలు సురక్షితంగా నిర్వహించాలన్నారు. డ్రోన్ చిత్రీకరణను కమాండ్ కంట్రోల్ రూముకు అనుసంధానించాలన్నారు. టోయింగ్ వాహనాలను రెండింటిని ఏర్పాటు చేయాలన్నారు. మెరైన్ పోలీసులు బీచ్ వద్ద పర్యవేక్షించాలన్నారు. ఉత్సవాల్లో మద్యం షాపులను పూర్తిగా మూసివేయించాలని పోలీసులను ఆదేశించారు. ప్రధాన కంట్రోల్ రూము నుంచి ప్రతీ గంటకు జిల్లా కలెక్టర్ ఫోన్‌కు ఉత్సవాల నిర్వహణ తీరు పట్ల సందేశాన్ని పంపించాలన్నారు. ప్రధాన కమాండ్ కంట్రోల్ రూము స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేఆర్సీ ఇన్‌చార్జిగాను, మినీ కమాండ్ కంట్రోల్ రూముకు డీఆర్డీఏ పీడీ ఇన్‌చార్జిగా వ్యవహరించాలన్నారు. అగ్నిమాపక, విపత్తు స్పందన సంస్థ, అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాల

నేడు నగర పంచాయతీ బడ్జెట్ సమావేశం

గొల్లప్రోలు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగరపంచాయతీ బడ్జెట్, సాధారణ సమావేశాలు శుక్రవారం జరుగుతాయని కమిషనర్ నామా కనకారావు తెలిపారు. నగరపంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగే ఈ సమావేశాల్లో అజెండాలోని అంశాలతో పాటు 2024-25లో సవరించిన, 2025-26 అంచనా బడ్జెట్‌లను ప్రవేశపెట్టి చర్చిస్తామని వివరించారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

కంటిచూపు సమస్యపై శ్రద్ధ వహించండి: కమిషనర్


కంటి వైద్య శిబిరం పరిశీలిస్తున్న కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కంటిచూపు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా ఆర్ఎస్ హాస్పిటల్, రే ఆప్టిక్స్ సంయుక్త నిర్వహణలో, కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కొండయ్యపాలెం శారదమ్మ ఆలయం వద్దగల నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఉచితకంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గురువారం కమిషనర్ భావన పరిశీలించారు. ఈ శిబిరంలో నగరపాలక పారిశుధ్య, ఇతర సిబ్బందికి సంపూర్ణ కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించారు. సుమారు 132మంది ఈ వైద్య పరీక్షల్లో తమ కళ్లను పరీక్షించుకున్నారు. డాక్టర్ పృధ్వీచరణ్, రే ఆప్టిక్స్ మేనేజర్ రవికిశోర్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్ద పీట వేస్తూ కాకినాడ నగరపాలక కమిషనర్ భావన గురువారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. రమణయ్యపేట కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం వెహికల్ యార్డుకు వెళ్లి వెహికల్స్ పనితీరు పరిశీలించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలి

పిఠాపురంరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంద్వారా గ్రామాల్లో పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పిఠాపురం మండలం విరవాడ పీహెచ్‌సీ కమ్యూనిటీ హాలులో గురువారం రుద్రవరపు భూలోకం అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలీలకు కనీసం 150 రోజుల పనిదినాలు కల్పించాలని, వేతనంగా రూ.500 చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కూరాకుల సింహాచలం, నాయకులు డెక్కల లాజరు, మేడపాటి చంటిబాబు, ఆశీర్వాదం, కృష్ణ, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని శ్రీ రాజరాజేశ్వరి ప్రయివేట్ ఐటీఐలో గురువారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ సీఐలు డి.రామారావు, ఎన్?రమేష్, ఎస్ఐ కె.అప్పారావు హాజరయ్యారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. సీఐలను సత్కరించారు.


పెద్దాపురంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ప్రజా సంఘాల నాయకులు


కాకినాడరూరల్: వర్ధంతి సభలో చిరంజీవినీకుమారి, మురళీధర్, ఆలపాటి


సర్పవరంజంక్షన్: మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మహాత్ముడి బాటలో పయనించాలి

• వర్ధంతి సభలో పాల్గొన్న పలు ప్రజా సంఘాలు, ప్రొఫెసర్‌లు


సామర్లకోట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...

పెద్దాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపతి మహాత్ముడి బాటలో ప్రతీఒక్కరూ పయనించాలని, లౌకిక భారత దేశాన్ని కాపాడుకోవడం, గాంధీజీ కలలను నిజం చేయడం ఆయనకు మనంఇచ్చే ఘనమైన నివాళి అని పలువురు ప్రజా సంఘాలకు చెందిన నాయకులు అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమంలో పలువురు పాల్గొని మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళు లర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు డా క్టర్ జ్యోత్యుల కృష్ణబాబు, గడిగట్ల సత్తిబాబు, చింతల సత్యనారాయణ,మరిడియ్య పాల్గొన్నారు.

అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో

సర్పవరం జంక్షన్: స్థానిక తిమ్మాపురం అక్నూ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో గురువారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ పోషించిన పాత్ర జాతి ఎన్నటికీ మరవలేనిదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

కాకినాడరూరల్ వలసపాకల సుందరయ్య కాలనీ సీఐటీ యూ కార్యాలయంలో జాతిపితి మహాత్మాగాంధీ వర్ధం తిని ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి సీఐటీయూ రూరల్ మండల కార్యదర్శి టి.రాజా, సీనియర్ నాయకులు సీహెచ్ అజయ్‌కుమార్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీఐటీయూ నాయకులు డి.సత్యనారాయణ, బి.రాంబాబు, పి.సాల్మన్‌రాజు, కాటుబాబు, దుర్గారావు, శ్రీను,నూకరాజు, డి.త్రిమూర్తులు, రాము, భద్రం పాల్గొన్నారు.

మద్యం, మాదకద్రవ్యాలు లేని దేశంగా తీర్చిదిద్దాలి

పిఠాపురంరూరల్: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా మద్యం, మాదక ద్రవ్యాలు లేని దేశంగా తీర్చిదిద్దాలని మద్యం, మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధులు కోరారు. గాంధీ వర్ధంతి సందర్భంగా పిఠాపురం మండలం గోకివాడలో గురువారం జరిగిన కార్యక్రమంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు వేమగిరి తలుపులయ్య, మరియమ్మ, చిన్నారి, గౌరీ, రాజేంద్రకుమార్, భవానీ, మరియ, పాప, చెల్లూరి సూర్యకుమారి, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీజీ చిరస్మరణీయుడు

సామర్లకోట: దేశ స్వాతంత్ర్యం అహింసా విధానం ద్వారా సాధించేందుకు విశేష కృషి చేసిన పూజ్యులు జాతిపిత మహా త్మాగాంధీజీ చిరస్మరణీయులని వాసవీ వనితా క్లబ్ పీఎస్‌టీ కటకం రత్నకుమారి, వైస్ గవర్నర్ కటకం హైమావతిలు పేర్కొన్నారు. మహాత్మాగాంధీజీ వర్ధంతి పురస్కరించుకుని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం ఆవరణలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌సీకె. భాను, కె.పద్మరత్నం, కంచర్ల సుష్మా మోహిని, నేతి మణికుమార్, కంచర్ల లలిత, కంచర్ల మహాలక్ష్మి, కెఎల్ఎన్‌జీపీ. పవన్‌కుమార్, దొంతుల లక్ష్మీసు భద్ర పాల్గొన్నారు.

ఐడీఎల్‌లో మహాత్మా గాంధీ వర్ధంతి సభ

కాకినాడరూరల్: కాకినాడ సామర్లకోట రోడ్డులోని ఐడీఎల్ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ అధ్యక్షతన మహాత్మాగాంధీ వర్ధంతి సభను నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి అతిథులంతా కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి మాట్లాడుతూ గాంధీ మరణించినా ఆయన ఆశయాలు సత్యం, అహింస ప్రతీ భారతీయుని మదిలోనూ నిండిఉన్నాయన్నారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న కేఎస్‌పీఎల్ సీవోవో మెర్ల మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులంతా గాంధేయవాదాన్ని అలవర్చుకోవాలన్నారు. జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ గాంధీజీ అంటే ఒక వ్యక్తి కాదని ఒక శక్తి అని ప్రపంచానికి దిశానిర్దేశంచేసారన్నారు. వ్యాసరచన పోటీలలోని విజేతలకు బహుమతులను అందజేసారు. జవహర్ ఆలీ, సయ్యద్, సుబ్బారావు, సలార్, వీరబాబు, సత్యమూర్తి, గౌరీనాయుడు,వెంకటేష్, పద్మజావాణి, వైస్ ప్రిన్సిపాల్ స్టీవెన్‌రాజు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లరేవు/యానాం: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా తాళ్లరేవులో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నివాళులర్పించారు. స్థానిక చెరువుగట్టు సెంటర్ వద్దగల బస్‌షెల్టర్‌వద్ద ఉన్న గాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. క్లబ్ ప్రతినిధులు సెంటర్ వద్ద శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు కుర్మదాసు భారతి, కార్యదర్శి చెక్కా సువర్ణ, కోశాధికారి వరదా జయశ్రీ, ఈక్లబ్ అధ్యక్షులు పసలపూడి విశ్వనాధం, అద్దేపల్లి సత్తిరాజు, పేకేటి సతీష్, కొత్తా సుభాస్, కుర్రాదాసు శ్రీను, అద్దేపల్లి శ్రీనివాస్ తాతాజీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు


గొర్రిపూడి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేస్తున్న దృశ్యం

కరప, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గొర్రిపూడిలో లిఫ్టిఇరిగేషన్ స్కీమ్‌కు సంబంధించిన రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురికాగా వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేసినట్టు నీటి సంఘం అధ్యక్షుడు జోకా అప్పలరాజు(తాతాజీ) తెలిపారు. తుల్యభాగ డ్రెయిన్‌లోని నీటిని ఈ స్కీమ్ ద్వారా లిఫ్ట్‌చేసి ఐదు గ్రామాల్లోని 4,800 ఎకరాలకు సాగునీరు అందించేవారమని గురువారం ఆయన విలేకరులకు తెలిపారు. ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌లను చోరీ చేయడంతో సాగునీటి ఎద్దడి దాపురించిందన్నారు. దీనిపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కలెక్టర్ షన్మోహన్‌లు స్పందించి రైతులకు సాగునీటి ఇబ్బంది తలెత్తకుండా వెంటనే ఒక కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరుచేశారని, అద్దె ప్రాతిపదికన మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను సమకూర్చారని తెలిపారు. ట్రాన్స్‌ఫారమ్‌లను ఏర్పాటుచేయించిన ఎమ్మెల్యే, కలెక్టర్‌లకు నీటి సంఘం అధ్యక్షుడు తాతాజీ, కూటమి నాయకులు గండి వెంకటేశ్వరరావు, అనుకూల రాంబాబు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : తహశీల్దార్


డీలర్లకు సూచనలిస్తున్న తహశీల్దార్ సత్యనారాయణ

కరప, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో అలక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ హెచ్చరించారు. కరప తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ డీలర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకపై ఎండీయూ వాహనాలు, రేషన్‌షాపులపై రెగ్యులర్‌గా తనిఖీలు ఉంటాయని, డీలర్లు, ఆపరేటర్లు సక్రమంగా పనిచేయాలని సూచించారు. ఉదయం 6:30 నుంచే ఎండీయూ ఆపరేటర్లు ఇళ్లకు వెళ్లి వినియోగదారులకు సరుకులు అం దించాలన్నారు. గొర్రిపూడి ఎండీయూ ఆపరేటర్‌పై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని, విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు స్టాక్ రిజిష్టర్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. స్టాక్ పాయింట్ నుంచి వస్తున్న సరుకుల్లో తరుగు ఎక్కువగా ఉంటుందని, దీని నుంచి మినహాయింపు ఇవ్వాలని ఈ సందర్భంగా డీలర్ల సంఘం మండలాధ్యక్షుడు నల్లా వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు నక్కా నాగేశ్వరరావులు తహశీల్దార్‌కు విజ్ఞప్తిచేశారు. ఎంఎస్‌వో కె.అనిల్, ఆర్ఐ పవన్, తదితరులు పాల్గొన్నారు.

సరైన శిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

• సెంట్రల్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి దయానంద్

కొత్తపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): చదువుకున్న యువతీ యువకులకు సరైన శిక్షణ ఇవ్వడంద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు అవకాశం ఉంటుందని హైదరాబాద్ సెం ట్రల్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య దయానంద్ అన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూలపేట ప్రతిభ అండ్ కేరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో కాకినాడజిల్లా కొత్తపల్లి, తొండంగి, పిఠాపురం మండలాలకు చెందిన యువతకు గురు వారం నిర్వహించిన సాఫ్ట్ వేర్ కోడింగ్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామీణ యువతకు ప్రతిభ మెండుగా ఉన్నప్పటికీ సరైన శిక్షణ, సౌకర్యాలు లేకపోవడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో వెనుకపడుతున్నారని దయానంద్ తెలిపారు. గ్రామీణ యువత ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే ఉద్దేశంతో అరబిందో ఫార్మా ఫౌండేషన్ వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానందరెడ్డి ఆదేశాల మేరకు సాఫ్ట్‌వేర్‌లో కోడింగ్‌లో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శిక్షణకు ఎంపికైన యువతకు సూచించారు. జావా, పైథాన్, హెచ్‌టీఎంఎల్, ఆర్‌డీఎంఎస్, జావా స్క్రిప్ట్, సీఎస్ఎస్‌లో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అరబిందో ఫార్మా ఫౌండేషన్ కో ఆర్డినేటర్ యువతకు విజ్ఞప్తి చేశారు.

7న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి


కరపలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కరప, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో జరుగనున్న లక్ష డప్పులు-వెయ్యి గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు చాట్ర ఇమ్మానుయేల్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాతపూడి అప్పారావులు విజ్ఞప్తి చేశారు. కరపలో గురువారం సంఘ నాయకులతో కలిసి జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఈ మేరకు కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను ఉభయ తెలుగురాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు తక్షణం అమలు చేయాలన్నారు. ఈ వర్గీకరణ అమలు కోరుతూ లక్ష డప్పులు-వెయ్యిగొంతులు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 5న గొల్లపాలెంలో జరగనున్న సన్నాహక కార్యక్రమానికి మాదిగ సోదరులు, డప్పు కళాకారులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సవరపు సత్తిబాబు, డప్పు కళాకారుల సంఘం అధ్యక్షుడు మందపల్లి దేవానందం, ఉందుర్తి ప్రకాష్, పలివెల చిన్నారావు, కటకం వీర్రాజు, మందపల్లి శ్రీను, మాచిరాజు, రాయి చిన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై రైతుల ఆందోళన

పిఠాపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణ శివారులోని మహారాజా రైల్వే వారధి(ఆర్వోబీ)కి ఇరువైపులా ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని తొలగించాలని డిమాండ్ చేస్తూ వారధి వద్ద గురువారం రైతులు ఆందోళన చేశారు. పంటపొలాలు నుంచి 216వ జాతీయ రహదారికి కనెక్టవిటీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆక్రమణలు తొలగించాలని, రోడ్డు నిర్మించాలని పలుమార్లు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు విన్నవించినా ఇప్పటివరకూ ఒక్కరు స్పందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వారధికి ఇరువైపులా ఉన్న ప్రభుత్వ స్థలాలు పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పాల్గొన్న మహారాజా రైల్వే వారధి పరిరక్షణ కమిటీ ప్రతినిధులు యనయంద్ర సూర్యనారాయణ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ విషయాలపై దృష్టిసారించి తక్షణం ప్రభుత్వ స్థలాలను పరిరక్షించి కనెక్టవిటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉన్నదాంతో ఇతరులకు సాయపడాలి

• పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా

పిఠాపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ తమకు ఉన్నదాంట్లో కొంత భాగాన్ని ఇతరులకు అందించి సాయపడాలని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా సూచించారు. తన మాతృమూర్తి జేహెరా బేగం 7వ వర్ధంతి సందర్భంగా అజీమా జహరమ్మ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు దుప్పట్లు, పండ్లు, పాలు, రొ ట్టెలు పంపిణీ చేశారు. మనోవికాస కేంద్రంలో దివ్యాంగులకు, శ్రావణి వృద్ధాశ్రమంలో వారికి వీటిని అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అహ్మద్ ఆలీషా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుజాత, హుస్సేన్‌షా, ఖలీల్‌షా, బాదుషా, పీఠం సభ్యులు రేఖాప్రకాష్, నగేష్, కృష్ణకుమార్, పెదపూడి చంటి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ తీగెలపై ట్రీకటింగ్, తదితర వార్షిక మరామ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్ కార్యనిర్వాహక ఇంజనీరు ఏఈఎస్‌డీఎస్ ప్రభాకర్ గురువారం రాత్రి తెలిపారు. డీఎస్‌ఏ ఫీడరు, వేట్లపాలెం ఇండస్ట్రియల్ ఫీడరు, పనసపాడు ఫీడరులు ఉన్నందున ఉండూరు వీకె. రాయపురం, వేట్లపాలెం, అచ్చంపేట, కొప్పవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ప్రభాకర్ తెలిపారు.

ఏసీపీగా శ్రీధర్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా కె.శ్రీధర్ బాధ్యతలు చేపట్టనున్నారు. మండపేట మున్సిపాల్టీలో టీపీఓగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఏసీపీగా ఇక్కడ బాధ్యతలు చేపట్టనున్నారు.

న్యాయసేవా కార్యకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసే వాధికార సంస్థ ఆదేశాల ప్రకారం పెద్దాపురం న్యాయసే వాధికార సంఘం పరిధిలో న్యాయసేవా కార్యకర్తల నియా మకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏడవ అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి పేర్కొన్నారు. మండలాల నుంచి వచ్చిన ఆయా దరఖాస్తుల్లో 25 మందిని న్యాయ సేవా కార్యకర్తలుగా ఎంపిక చేయడంతోపాటు వారికి శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల వారు పదో తరగతి ఇతర సాంకేతిక ఉత్తీర్ణత, జనన, ధ్రువ పత్రం, సామాజిక సేవా పనులకు సంబంధించిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు. పాస్‌పోర్టు సైజ్ ఫోటో దరఖాస్తుతో జత పరిచి గెజిటెడ్ సంతకం చేయించాల్సి ఉంటుం దన్నారు. ఫిబ్రవరి 4వ తేదీలోగా పెద్దాపురం కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయసేవా సంఘంలో సమర్పించాలన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో గీత కులాల వారికి మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఎక్సైజ్ సీఐ అర్జునరావు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఫిబ్రవరి 5న సాయంత్రం వరకూ జరుగుతుందన్నారు. పెద్దాపురం మున్సిపాలిటీ - 1, గండేపల్లి మండలం - 1, జగ్గంపేట మండలం - 1 షాపులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు నాన్ రిఫండ్‌బుల్ ఫీజు రూ.2లక్షలతో పాటు, నివాస, కుల, ఉపకుల ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్, పాస్ పోర్టు సైజ్ జతచేయాలన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పిఠాపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. పిఠాపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం పట్టణానికి చెందిన పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల వద్దకు వెళ్లి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించాలని కోరాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను అందించి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని చెప్పారు.

చేబ్రోలు పీహెచ్‌సీలో డీఐవో విచారణ

గొల్లప్రోలురూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు పీహెచ్‌సీలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సుబ్బరాజు గురువారం విచారణ నిర్వహించారు. పీహెచ్‌సీలో వైద్యసేవలు సక్రమంగా అందడంలేదని ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పీహెచ్‌సీ తనిఖీకి వచ్చిన ఆయన రికార్డులు పరిశీలించి విచారణ చేపట్టారు. విచారణను అత్యంత రహస్యంగా నిర్వహించడంతో పాటు వివరాలు వెల్లడించేందుకు నిరాకరించడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటా

• మాజీ ఎమ్మెల్యే వర్మ


సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

గొల్లప్రోలు రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి అన్నివేళలా అండగా ఉంటానని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో అనారోగ్యంతో మరణించిన కాకినాడ చిన్న కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న రాకాటి గోపాలం కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

డైరీ ఆవిష్కరించిన కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ల అసోసియేషన్ ముద్రించిన 2025 నూతన సంవత్సర డైరీని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, నగరపాలక కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం నూతన సంవత్సరం-2025 క్యాలెండర్‌ను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆవిష్కరించారు. స్థానిక జగన్నాధపురంలోని ఎమ్మెల్యే నివాసంవద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో టీఎన్‌టీ యూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు, తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వై శ్రీనివాసరావు, కె.వీరబా బు, జి.సత్యనారాయణ, శర్మ, పీవీ సత్యనారాయణ, కృష్ణవేణి, సుజాత పా ల్గొన్నారు.

మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడికి సత్కారం

డై-స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్శిటీ నుంచి డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్ అవార్డు, చేయూత సోషల్ సర్వీస్ నుంచి సేవారత్న అవార్డులను అందుకున్న జిల్లా టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్‌ను గురువారం కాకినాడసిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ మైనారిటీ సెల్ నాయకుడు ఎంఏ తాజుద్దీన్, ఎండీ అన్సర్, ఆలీ, రహీమ్, నవాబ్, బేగ్ పాల్గొన్నారు.

జనవాణిలో రెండోరోజు వినతుల స్వీకరణ

సర్పవరం జంక్షన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గురువారం మంగళగిరిలో రెండోరోజు ఆపార్టీ కేంద్ర కార్యాలయంలో జనవాణిలో ప్రజల నుంచి వివిధ సమస్యల పరిష్కారంపై వినతులను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ స్వీకరించారు. జనవాణికి వచ్చిన మహిళలు, పెద్దల సమస్యలు సావధానంగా తెలుసుకున్నారు. సమస్యల సత్వర పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే నానాజీ మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేశారు. వినతులు స్వీకరించారు.


మహిళల నుంచి వినతులు స్వీకరిస్తున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత : ఆర్టీవో శ్రీధర్

సామర్లకోట, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాల్లో గంటకు ఒకరు చొప్పున బలి అవుతున్నారని ప్రమాదం జరిగినపుడు ప్రమాద బాధితులను రక్షించడంలో మొదటి 60 నిమిషాలు ప్రమాద తీవ్రత తగ్గించేందుకు కృషిచేయాలని జిల్లా రవాణా అధికారి శ్రీధర్ పేర్కొన్నారు. రహదారి ప్రమాద బాధితులకు సహాయం చేయడం మనందరి బాధ్యత అనే అంశంపై బాధిత కుటుంబసభ్యులకు అవగాహన సదస్సు గురువారం సాయంత్రం పనసపాడు మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ శుభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ శ్రీధర్ మాట్లాడుతూ ప్రమాద సమయంలో ప్రత్యక్షంగా అందుబాటులో ఉన్న వారు బాధితులకు సహాయంచేసి సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించాలన్నారు. రహదారి ప్రమాదాల్లో సహాయం చేసినవారికి రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకువచ్చిందన్నారు. అనంతరం మెడికవర్ సెంటర్ హెడ్ శుభాకరరావు మాట్లాడుతూ రహదారి ప్రమాద భాదితులకు సహాయ కారిగా వచ్చిన వారిని ఆసుపత్రి సిబ్బంది కానీ, యాజమాన్యం కానీ మెడికో లీగల్ విషయంలో లేదా వైద్యానికి అయ్యే ఖర్చును ఎటువంటి ఇబ్బందులు కలుగ జేయరన్నారు.డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ పద్మావతి, గౌతమ్‌రాయ్ తదితర విభాగాల హెడ్‌లు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు : సీఐ

కొత్తపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పిఠాపురం సీఐ శ్రీనివాస్, కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ హెచ్చరించారు. కొత్తపల్లి వీవీ ఎస్ కళాశాలలో గురువారం ఈవ్‌టింగ్, సైబర్‌నేరాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్‌లో వచ్చే తెలియని నంబర్ల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెస్సేజ్‌లతో సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాల్లో నగదును అపహరించే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థులు ఈవ్‌టీజింగ్ పాల్పడరాదని, ఎటువంటి పరిస్థితుల్లో ఈవ్‌టీజింగ్ పాల్పడినట్టయితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ, సీఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

'ఏజెన్సీలో ఎస్సీలకు అన్యాయం'

రంపచోడవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఎస్సీలకు పదవీ భాగ్యం లేదని మాల మహాసభ కన్వీనర్ మాదే రామచంద్రరావు గురువారం ప్రకటనలో ప్రశ్నించారు. బ్రిటీష్ కాలం నుంచి మన్యంలో ఎస్సీలకు గుర్తింపు లేదని, ఎస్సీలపై ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ కల్పించకపోతే ఐక్య ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రైతుల ఆర్థికాభివృద్ధికి చర్యలు



ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేలా చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. గురువారం ఆయన ఐటీడీఏ కార్యాలయంలో వ్యవసాయ, ఉపాధి హామీ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వచ్చే తొలకరి నాటికి వ్యవసాయనికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. గ్రామాల్లో పశువుల వ్యాధి నిరోధక టీకాలపై ఆరా తీశారు. పశుసంవర్ధక శాఖ చేపట్టిన రోజువారీ కార్యక్రమాలపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఉపాధి హామీకి సంబంధించి కొత్త పనుల మంజూరుకు నివేదికలు సమర్పించాలన్నారు. ఏజెన్సీలో వందన వికాస్ కేంద్రాల ద్వారా రంపచోడవరం, అడ్డతీగల మండలాల్లో జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, అసిస్టెంట్ డైరెక్టర్లు సూర్యనారాయణ, గణేష్, సీహెచ్‌కేవీ చౌదరి, కె.సావిత్రి, పీహెచ్‌వో కె.చిట్టిబాబు, పీఏవో ఎల్.రాంబాబు, ఏవో కె.లక్ష్మణ్, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.





ఎటపాకలో మహాత్ముడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, ప్రజాప్రతినిధులు (పైన) అడ్డతీగలలో కాంగ్రెస్ నాయకుల నివాళి

మహాత్మా గాంధీ వర్ధంతి

ఎటపాక, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని ఎటపాక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, ఎంపీపీ కాక కామేశ్వరి, ఉపాధి హామీ ఏపీవో రాఘవయ్య, జడ్పీటీసీ ఉబ్బా సుస్మిత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అడ్డతీగల (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ సెంటర్లో మహాత్ముని విగ్రహానికి కాంగ్రెస్ నాయకుడు దంగేటి సత్తిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



ఇంజనీర్లను అభినందిస్తున్న ఎస్ఈ చినకామేశ్వరరావు

డొంకరాయి సీలేరు కాంప్లెక్స్‌కు బెస్ట్ పెర్ఫార్మింగ్ అవార్డు

మోతుగూడెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయి సీలేరు కాంప్లెక్స్‌కు బెస్ట్ పెర్ఫార్మింగ్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా ఎస్ఈ చిన్న కామేశ్వరరావు గురువారం జల విద్యుత్ కేంద్రానికి వచ్చి ఇంజనీర్లకి, సిబ్బందికి అభినందనలు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన 11కేవీ వీసీబీని ఎస్ఈ ప్రారంభించారు.

నిరుద్యోగ యువతకు 'ప్రేరణ' ద్వారా ఉద్యోగావకాశాలు

రాజవొమ్మంగి ఎస్ఐ నరసింహమూర్తి



రాజవొమ్మంగి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థలో పనిచేసేందుకు నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులు సమీపంలోని పోలీస్‌స్టేషన్లో వివరాలు నమోదు చేయించుకోవాలని రాజవొమ్మంగి ఎస్ఐ నరసింహమూర్తి కోరారు. అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆధ్వర్యంలో ప్రేరణ ద్వారా జిల్లాలోని 18 నుంచి 26 సంవత్సరాల వయసు కలిగిన పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదివిన యువత దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్వాలిఫికేషన్ సర్టిఫికెట్, ఆధార్, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, బయోడేటాతో సంప్రదించాలన్నారు. ఫిబ్రవరి 1న రంపచోడవరం, 3న చింతూరు పోలీస్ డివిజన్ కేంద్రాల్లో ఇన్నోసెన్స్ సర్వీసింగ్ ప్రైవేటు కంపెనీ తరఫున ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన, ప్రభుత్వ ఉద్యోగానికి దీటుగా పీఎఫ్, మెడికల్ బెనిఫిట్స్, ఇతర అలవెన్సులు ఇస్తారు. నెలకు రూ.18,950 జీతంతో నర్సాపూర్ టౌన్, కోలార్, హోసూర్, బెంగళూరు ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుంది.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

'పెండింగు వేతనాలు చెల్లించాలి'

కూనవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు పెండింగు వేతనాలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకట్ కోరారు. గురువారం జరిగిన సమావేశంలో నాయకులు శ్రీను, శ్రీదేవి, సీత, శారద, కిరణ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దోనెలపాలెంలో 'ఫ్యామిలీ డాక్టర్'

రాజవొమ్మంగి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోనెలపాలెంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహించారు. జడ్డంగి వైద్యాధికారి నాగార్జున ఆధ్వర్యంలో వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ సుష్మ, ఏఎన్ఎం కృష్ణవేణి, 104 డీఈవో శ్రీనివాస్, పైలట్ కనకరాజు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

జాతిపితకు ఘననివాళి

అన్నవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం ఆయనకు వాసవీ, వనితక్లబ్ ఆధ్వర్యంలో ఘననివాళులర్పించారు. వాసవీసత్రంవద్ద బాపు విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వనితక్లబ్ అధ్యక్షులు దాసరి గౌతమి మాట్లాడుతూ గాంధీజీ బాటలో ప్రతిఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ అమరా వీరలక్ష్మి, దాసరి రజనీ, వాసవీక్లబ్ అధ్యక్షులు దాసరి కుమార్, నవీన్, విహారి, బోనగిరి శ్రీనివాస్, కడిమిశెట్టి సతీష్, బొలిశెట్టి రమేష్, జొన్నాడ రాజేష్ పాల్గొన్నారు.



అన్నవరంలో మహాత్మగాంధీకి నివాళులర్పిస్తున్న వాసవీ, వనితక్లబ్ సభ్యులు

కోటనందూరులో..

కోటనందూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో గాంధీజీ వర్ధంతిని పోలీసులు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి గాంధీజీకి చిత్రపటానికి నివాళులర్పించారు.



జగ్గంపేటలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ సూచించిన మార్గం నేటి యువతకు ఆదర్శప్రాయమని నగర పంచాయతీ మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ అన్నారు. గాంధీనగర్‌లో ఏఎంసీ కమిటీ సభ్యులు పైల విజయ్‌కుమార్ నేతృత్వంలో గాంధీ వర్ధంతి గురువారం నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులు, నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. విశ్రాంత ఉద్యోగులు కోరాడ అప్పల స్వామి, చందక రామ్మోహనరావు, ఎంపిటిసీ సభ్యులు యిజనగిరి ప్రసాద్, కావలి శ్రీనివాస్, పతివాడ జగదీష్, దాసరి గణేష్, అలమూరి సుబ్బారావు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జగ్గంపేటలో..

జగ్గంపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండలంలో జగ్గంపేట ఆర్య వైశ్య సేవా సంఘం, వాసవీ క్లబ్ లో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమానికి వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ మానేపల్లి బంగారాజు, రాష్ట్ర ఆర్య వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు ముఖ్యఅతిథిగా హాజరై గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివంగత మాజేటి రమాదేవి జ్ఞాపకార్థం వారి భర్త సత్యనారాయణ 15మంది పేద ఆర్యవైశ్యులకు వడ్డీ లేని రుణం రూ.25వేల చొప్పున అందించారన్నారు. కార్యక్రమంలో కొత్త భైరవకృష్ణ, దారా శ్రీనివాస్, డొంకా నూకరాజు, బొండాడ జగన్, మామిడిపాక సతీష్, కంచర్ల బాబు,బొండ అయ్యప్ప, మానేపల్లి రామానుజ, వి. గణేష్, పొట్టి రాజేష్, కొత్త శ్రీరామకృష్ణ, ఎస్.వెంకన్నబాబు పాల్గొన్నారు.

ధర్మవరంలో..

ప్రత్తిపాడు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో ఎంఎంఆర్ ట్రస్ట్ కార్యాలయంవద్ద గురువారం గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల తాతబాబు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించాలి: డ్వామా పీడీ

రౌతులపూడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డు కలిగి ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి ఉపాధి హామీ సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు. గురువారం మూలగపూడి, బంగారయ్యపేట గ్రామాల్లో గోశాల నిర్మాణ పనులను పరిశీలించారు. మూలగపూడిలో పెదచెరువులో ఉపాధి పనులు పరిశీలించారు. కూలీలకు అందుతున్న వేతనాల గురించి, కల్పిస్తున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. జాబ్‌కార్డు కలిగి అందరికీ పనులు కల్పిస్తామని తెలిపారు. గోశాల నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీపడవద్దని అధికారులకు సూచించారు. ఈమె వెంట ఏపీడీ జగదాంబ, ఏపీవో డి. సురేష్ పాల్గొన్నారు.

వంతాడ సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వంతాడలో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా తెలిపారు. వంతాడలో గురువారం ఆమె పర్యటించారు. గ్రామంలో పలు సమస్యలపై మహిళలు వినతిపత్రం అందజేశారు. వంతాడ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం వంతాడ, గోకవరం గ్రామాల్లో మృతి చెందిన పలు కుటుంబాలను పరామర్శించారు. గోకవరంలో శిథిల పాఠశాలను పరిశీలించారు. సర్పంచ్ వడపర్తి రామలక్ష్మి నాగేశ్వరరావు, టీడీపీ నాయకుడు యాళ్ల జగదీష్, అంబటి రాంబాబు, బొంతిన సురేష్, లొండా లోవరాజు, చీకట్ల నాని, కుడే లక్ష్మి, కుండల అప్పారావు పాల్గొన్నారు.



వంతాడ మహిళల సమస్యల వినతిని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

సూపరింటెండెంట్‌కు సత్కారం



ఉత్తమ వైద్యురాలిగా పురస్కారం అందుకున్న ఏలేశ్వరం ఆస్పత్రి సూపరింటెండెంట్ శైలజను సత్కరిస్తున్న విశ్రాంతి ఉద్యోగులు

ఏలేశ్వరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. గురువారం తెలగా కాపు సంక్షేమ సంఘం, పెన్షనర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు తండ్రి చిన బుచ్చిరాజు 64వ వర్ధంతి పురస్కరించుకుని వారి జ్ఞాపకార్థం రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు జిల్లా వైద్యాధికారిణి స్వప్న, సూపరింటెండెంట్ శైలజ రోగులకు అందజేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ పురస్కారం అందుకున్న సూపరింటెండెంట్ శైలజను సోమరాజు బృందం శాలువా కప్పి, మెమెంటో అందించి ఘనంగా సత్కరించారు. కంచుబట్ల కృష్ణ, ఇబ్రహీం ఖాన్, చెన్నా ప్రగడ సత్య గాంధీ, రౌతు సహదేవుడు, ఉడతల రమణారావు పాల్గొన్నారు.

సర్పంచ్ దంపతులకు సత్కారం



సర్పంచ్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగపతినగరం పంచాయతీలో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సభ్యురాలు శ్రీలత రాంబాబును దళితులు ఘనంగా సత్కరించారు. గండేపల్లి, గోకవరం మండలాల మాజీ ఎంపీపీ దారా ఏసురత్నం, ఈది అశోక్, కిర్లంపూడి, గండేపల్లి, గోకవరం మండలాల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పురం హరీష్, పెదపాటి సుభాకర్, మోర్త చిట్టిబాబు, జగ్గంపేట మండల ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బత్తినస్వామి, బూరుగుపూడి ఫిషర్‌మెన్ సొసైటీ చైర్మన్ మూర సత్తిబాబు, తుమ్మల కిషోర్, గుడాల చిట్టిబాబు, కూళ్ల రాజు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సాయి బోధనలు ఆచరణదాయకం

జిల్లా సత్యసాయి సేవా కన్వీనర్ సూర్యనారాయణ

ప్రత్తిపాడు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయిబాబా బోధనలు అనుసరణీయమైనవి జిల్లా సత్యసాయి సేవా కన్వీనర్ సూర్యనారాయణ అన్నారు. సత్యసాయి సేవా కేంద్రం 18వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన పతాకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఈఏడాది నవంబరు 23న నిర్వహించే సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను సమైక్యంగా విజయవంతం చేయాలన్నారు. వార్షికోత్సవం సందర్భంగా ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, బాబా చిత్రపటానికి, పాదుకానికి అష్టోత్తర పూజ చేశారు. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం ఆధ్వర్యంలో 127మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో తొలి సబ్‌జోన్ కన్వీనర్ తుమ్మలపల్లి జోగేంద్రనాథ్, పి.నాగేశ్వరరావు, యార్లగడ్డ గోవిందరాజు, కె.జయబాబు, కొల్లా వీర్రాజు, తుమ్మలపల్లి చిట్టి కామేశ్వరి, సాయి లక్ష్మి, సత్యనారాయణ మూర్తి, బద్రి పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ సక్రమంగా అందించాలి

గిరిజన సంక్షేమశాఖ రంపచోడవరం డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి

వై.రామవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వసతిగృహ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూను సక్రమంగా అందించాలని గిరిజన సంక్షేమశాఖ రంపచోడవరం డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి అధికారులకు సూచించారు. గురువారం ఆమె మండలంలోని పనసలపాలెం, దాలిపాడు, యార్లగడ్డ, బందిగడ్డ, వై.రామవరం ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీ చేశారు. స్టోర్ రూముల్లో ఉన్న ఆహార పదార్థాలను పరిశీలించారు.విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, వారి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలల్లో రికార్డులను తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరెడ్డి, అప్పలనాయుడు, లక్ష్మి, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్న పాల్గొన్నారు.

ట్రాఫిక్, హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

గండేపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ట్రాఫిక్, హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించినట్లు ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ సీఐ ఎస్.రమేష్, డీన్ క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ ప్రో వి.సత్యనారాయణ, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ బీహెచ్‌వీ వరప్రసాద్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బి.రాంబాబు, జూనియర్ మేనేజర్ అఫియానాజర్ పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం



గండేపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో ఎంపీడీవో నాతి బుజ్జి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ముందుగా మహాత్మగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధశాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు వారి శాఖకు సంబంధించిన సమస్యలు లేదా అవసరాలు ఏమైనా ఉంటే మండల పరిషత్ దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే సహకారంతో జిల్లాస్థాయి అభివృద్ధి సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బిట్ర వెంకటలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు పరామర్శ

జగ్గంపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం మల్లిశాల సర్పంచ్ సర్వసిద్ధి లక్ష్మణరావును టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, అడప భరత్‌బాబు, బుర్రి సత్తిబాబు పాల్గొన్నారు.

'మెట్ట ప్రాంత రైతులకు ఆయిల్ పామ్ ఎంతో మేలు'

జగ్గంపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం గుర్రంపాలెంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ హెడ్ ప్లాంటేషన్ వి.పట్టాభిరామారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో డీజీఎం ఏఎస్‌ప్రకాష్ రైతులు పాల్గొన్నారు.

రూ.20లక్షలతో గెద్దనాపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణాలు

కిర్లంపూడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవతో గ్రామాల్లో సీసీ రోడ్లు జోరందుకున్నాయి. గెద్దనాపల్లిలో ఎస్సీపేటలో కొత్త కాలనీలో కలిపి రూ.20లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ సూరిశెట్టి వెంకటశివ, మాజీ ఎంపీటీసీ సూరిబాబు, టీడీపీ నాయకులు గుడాల చిట్టిబాబు పనులను పర్యవేక్షిస్తున్నారు.

నేడు ప్రత్తిపాడు మండలంలో విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రత్తిపాడు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలంలో ఉత్తరకంచి విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు నిమిత్తం శుక్రవారం ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేసినట్లు జగ్గంపేట విద్యుత్‌శాఖ ఈఈ డి.వీరభద్రరావు గురువారం తెలిపారు. మండలంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని ధర్మవరం, పొదురుపాక, పాండవులపాలెం, బవురువాక, శరభవరం, గజ్జినపూడి, చింతలూరు, శాంతి ఆశ్రమం, వెంకటనగరం, యుజేపురం, వాకపల్లి, పోతులూరు, ఉత్తరకంచి, పెద్దిపాలెం, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ, వేములపాలెం, వంతాడ, గోకవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.